


అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36(మంగళవారం)
కనిష్ఠం : 28

మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల బదిలీలు 7

అభివృద్ధి పనులకు బకాయిలు లేకుండా సీఎస్సార్ నిధులు కేటాయించాలి

» చమురు సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పనులకు బకాయిలు లేకుండా చమురు సంస్థలు సామాజిక బాధ్యత కింద నిధులను కేటాయించి విడుదల చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు.జిల్లాలో చమురు, సహజ వాయువుల నిక్షేపాలను వెలికితీసి తరలిస్తున్న చమురు సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన సీఎస్సార్ నిధుల వినియోగంపై సమీక్షించారు.ఏటా ఓఎన్జీసీ, గెయిల్‌సంస్థలు సీఎస్సార్ కింద కేటాయించే నిధులతో జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి పంపుతామన్నారు.ప్రజాప్రతినిధులు ప్రాధాన్య క్రమంలోనే అభివృద్ధి పనులను ప్రతిపాదిస్తున్నారన్నారు. ఆ దిశగా చమురు సంస్థల ప్రతినిధులు సీపీవోను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రతిపాదిత పనులన్నింటికీ నిధులు కేటాయించాలని ఆదేశించారు. 2021-26 ఆర్థిక సంవత్సరానికి సీఎస్సార్ నిధుల లక్ష్యాలను ఆయన నిర్దేశించారు.సీఎస్సార్ సమావేశాలకు బాధ్యతగల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. సీఎస్సార్ నిధుల కింద 50శాతం ఆరోగ్యం, పోషకాహారం, మిగిలిన 50శాతం అభివృద్ధి పనులకు కేటాయించాలన్నారు. కొత్తపేట, రాజోలు, మండపేట, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ప్రతిపాదిత పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సకాలంలో నిధులు అందించాలన్నారు. తాగునీరు, సాగునీరు కోసం ఎత్తిపోతలు, డయాలసిస్ సెంటర్, ఓఎన్జీసీ హెవీ వెహికల్స్ వెళ్లే రహదారుల నిర్మాణాల్లో పూర్తిగా సహకారం అందించాలని ప్రజాప్రతినిధులు కోరారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చమురు సంస్థలు హితోధికంగా నిధులు కేటాయించి ప్రజల జీవనప్రమాణాలను మెరుగు పరచాలన్నారు. సమావేశంలో అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కొత్తపేట, రాజోలు ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, దేవ వరప్రసాద్, చమురు సంస్థల ప్రతినిధులు రాజు, రాంజీ, సునీల్ కుమార్, శాస్త్రి, రామారావు పాల్గొన్నారు.



రూ.8కోట్లతో నిర్మించిన
పి.గన్నవరం-అంబాజీపేట మధ్య ఇటీవల నిర్మితమైన రహదారి

సంక్షేమంతో అడుగులు.. అభివృద్ధి పరుగులు

రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పాలన పూర్తి చేసుకుంది. అంతకుముందు ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని ఎన్నో కీలక అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిలోనే పరుగులు పెట్టించింది. అధ్వానస్థితిలో ఉన్న కీలక రహదారుల అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులను వెచ్చించింది. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన కొత్త హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో పథకాలకు వందల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టగా కూటమి పాలనలో పాత, కొత్త బకాయిలను క్లియర్ చేసింది. అభివృద్ధి, సంక్షేమం సమతూకంతో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంది. ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి ఏడాది పూర్తవుతోంది. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

» సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనకు నేటితో ఏడాది
» రహదారుల అభివృద్ధితోపాటు అన్నక్యాంటీన్లు ప్రారంభం
» పింఛన్లు, మత్స్యకార భరోసా పెంపు
» రైతులకు పెండింగ్ ధాన్యం బకాయిలు చెల్లింపు
» 'ఉచిత గ్యాస్ సిలిండర్' అమలు
» గత వైసీపీ పాలనలో అభివృద్ధికి బ్రేక్
» కూటమి పాలనలో పట్టాలెక్కి పరుగులు

(అమలాపురం, ఆంధ్రజ్యోతి)
ఈ ఏడాది కాలంలో ప్రధానంగా అధ్వాన స్థితిలో ఉన్నప్రధాన రహదారులన్నింటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రజల కష్టాలను తీర్చిదిద్దారు. గ్రామీణప్రాంతాల్లో రహదారుల అభివృద్ధినుంచి జాతీయరహదారుల పునర్నిర్మాణం వరకు గతంలో నిలిచిన ప్రాజెక్టులన్నింటికీ కూటమి ప్రభుత్వం మోక్షం కలిగించింది. పి.గన్నవరం-అంబాజీపేట మధ్య రహదారి అధ్వాన్నంగా మారి వైసీపీ పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.32 కోట్ల అంచనా వ్యయంతో పి.గన్నవరం-అంబాజీపేట రహదారితోపాటు మరో మూడు రహదారులను నిర్మించారు. ఇలా అన్ని నియోజకవర్గాల్లోను ప్రధాన రహదారుల అభివృద్ధి చేశారు. 216లో పెండింగ్‌లో ఉన్న పాశర్లపూడి-కడలి బైపాస్ రహదారి నిర్మాణానికి కూడా ఈ ప్రభుత్వంలో పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ధాన్యం బకాయిల చెల్లింపు

గ్రామీణప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో వందల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించారు.ఏటిగట్ల రహదారులు సైతం అభివృద్ధిచేశారు. గత ప్రభుత్వంలో రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలతో కలిసి రూ.154.63కోట్ల చెక్కును పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అమలాపురంలో రైతులకు అందించారు. మత్స్యకార భరోసా కింద రూ.10వేలు చెల్లించే పరిహారాన్ని రూ.20వేలకు పెంచి జిల్లాలో మత్స్యకారులకు ఆ నిధులు చెల్లించారు. అమలాపురం, ముమ్మిడివరం, మండపేట, రామచంద్రపురంలో అన్నక్యాంటీన్లు ప్రారంభించి రూ.5కే అల్పాహారం, భోజన వసతిని కల్పించారు. ఎన్నోఏళ్లుగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్న డీఎస్సీ ప్రకటన విడుదలచేసి రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ ఉపాధ్యాయులకు పరీక్షలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ విధానానికి స్వస్తి పలికి జూన్ 1నుంచి జిల్లావ్యాప్తంగా 923కు పైగా ఉన్నచౌక డిపోల ద్వారా 5.37లక్షల మంది లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీచేస్తున్నారు. పెరిగిన పింఛను సొమ్ములతో కలిపి రూ.వందకోట్ల మేర నిధులను ప్రతినెల దివ్యాంగ, వితంతు, వృద్ధులకు పింఛన్లను 1నే పంపిణీ చేస్తున్నారు. ఇసుక సంక్షోభంతో గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డ భవన నిర్మాణ కార్మికులకు ఆ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉచితంగా ఇసుకను పొందే సౌకర్యాన్ని కల్పించారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని మొదటి దశ పూర్తి చేశారు. రెండో దశ కొనసాగుతోంది. పాస్టర్లకు, పురోహితులకు, మౌజామ్‌లకు ఇలా వివిధ వర్గాల వారికి ఇవ్వాల్సిన పారితోషకాలను ప్రభుత్వం యథావిధిగా పంపిణీ చేస్తోంది. రచ్చబండ, ప్రజావేదిక కార్యక్రమాల ద్వారా సీఎం చంద్రబాబు ప్రజలకు చేరువయ్యే రీతిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా గతంలో నిలిచిపోయిన గృహ నిర్మాణ పథకాలను సమీక్షించి వాటిని పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేశారు. జగన్ నిర్లక్ష్యం కారణంగా గ్రహణం పట్టిన అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీల్లోని టిడ్కో ఇళ్లకు మోక్షం కలిగించి లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేశారు. కాగా పీ4లో భాగంగా ఆయా గ్రామాల్లో పేదలను ధనికులకు దత్తత ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రానున్న వర్షాకాలంలో ఇసుక సమస్య ఉత్పన్నం కాకుండా భవన నిర్మాణదారులు, కార్మికుల కోసం భారీగా ఇసుక నిల్వలను డంపింగ్ చేసి సిద్ధంగా ఉంచారు. రైతులు రబీ సీజన్‌లో ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే నేరుగా ఖాతాలకు సొమ్ములు జమయ్యే విధానం అమలు చేయడంవల్ల రైతుల ఆనందాలకు అవధుల్లేవు. ఇటీవల బడుగు బలహీనవర్గాలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకోసం ప్రభుత్వం రుణాలు మంజూరు చేసింది. కాపు కార్పొరేషన్ ద్వారా కూడా భారీగా రుణ ప్రణాళికను అమలు చేసింది. ప్రస్తుతం నెలరోజులపాటు యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రత, యోగా అలవరచుకోవడం వంటి అంశాలపై శిక్షకులు ఇచ్చే పలు కార్యక్రమాలు చేపట్టింది.





గతేడాది ఆగస్టు 12న రైతులకు చెక్కును అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్.. అన్నక్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ మహేష్‌కుమార్

ఐదేళ్ల వైఫల్యాలను పక్కన పెట్టి..

జగన్ ఐదేళ్లపాలనలో రాష్ట్రంతోపాటు కోనసీమ జిల్లా భ్రష్టు పట్టిపోయింది. ఎన్నో కీలక ప్రాజెక్టులకు గ్రహణం పట్టించారు. సమస్యలను గాలికి వదిలేశారు. అప్పట్లో కేంద్రం అమలుచేసే పథకాల నిధులను మళ్లించడం ద్వారా వాటినీ భ్రష్టు పటించారు. ఇసుక, ఇతర క్వారీల ద్వారా లభ్యమయ్యే వందల కోట్ల విలువైన సంపదను వైసీపీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో భారీగా దోపిడీకి గురైంది. రహదారులు, అన్న క్యాంటీన్లు ఇలా అనేక పథకాలను అప్పట్లో మరుగున పెట్టేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు, రైతులకు, కాంట్రాకట్టర్లకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన వందల కోట్ల బకాయిలను ప్రభుత్వం దశలవారీగా విడుదల చేసింది. అప్పట్లో నిలిపివేసిన కీలక ప్రాజెక్టులన్నింటినీ తిరిగి పట్టాలకెక్కించి అభివృద్ధి చేస్తోంది. ఒకవైపు గత ప్రభుత్వ వైఫల్యాలను ఆర్థిక నష్టాలను అధిగమిస్తూ అష్టకష్టాలు పడుతూ పాత బకాయిలను క్లియర్ చేస్తూ ప్రజలను సంక్షేమంపై చంద్రాబు ప్రభుత్వం దృష్టిపెట్టి ప్రజారంజక పాలన కొనసాగిస్తోంది.

గతంలో నరకం చూశాం



గత ప్రభుత్వంలో గుంతల రోడ్లతో నరకం చూశాం. అమలాపురం వెళ్లి రావాలంటే రెండు గంటలు పట్టేది. రాత్రి సమయంలో నానా అవస్థలు పడేవాళ్లం. ఇటీవలే రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. అరగంటలోనే అమలాపురం చేరుకుంటున్నాం. పి.గన్నవరం-అంబాజీపేట రహదారి దీనికి నిదర్శనం. మండలంలోని లింకు రోడ్లను సైతం సుందరంగా తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి విషయంలో రాజీపడడంలేదు. పూర్తిస్థాయిలో హౌసింగ్ రుణాలు మంజూరు చేస్తే వివిధ రంగాల చేతి వృత్తుల వారికి పని దొరుకుతుంది.

-నందపునీడి గురురామ ప్రసాద్, మండల వినాయక తాపీమేస్త్రీల సంఘం కార్యదర్శి

పేదల కడుపు నింపే అన్నక్యాంటీన్



పేదలకు భోజనం పెట్టేందుకు అమలు చేస్తున్న అన్నక్యాంటీన్‌వల్ల ఎందరో కడుపు నింపుకుంటున్నారు. ఏఆధారం లేనివారు, ఒంటరి వాళ్లకు ఇది ఎంతో ఉపయోగపడుతోంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని రూ.5కే అందిస్తున్నారు. ఇది మంచి పథకం. నా లాంటి ఒంటరి వారికే కాకుండా జట్టు కార్మికులు, మాల్స్‌లో పని చేసేవారు ఇక్కడ ఆహారం తింటున్నారు.

-సామంతకుర్తి బాలవెంకట్రావు, ముమ్మిడివరం

రైతులకు అండగా..



రైతులకు అమలు చేసే సంక్షేమ పథకాలను గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వాటన్నింటినీ చంద్రబాబు ప్రభుత్వం పునరుద్ధరించింది. వైసీపీ హయాంలో యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ, డ్రిప్ ఇరిగేషన్‌ను రద్దుచేయగా వాటిని ఇప్పుడు పునరుద్ధరించారు.రైతులనుంచిధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లోనే సొమ్ములు చెల్లిస్తున్నారు. కాల్వల ఆధునికీకరణ పనులు ముమ్మరం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్రం రూ.6వేలతో కలిపి రూ.20వేలు చెల్లించనున్నారు.

-మట్టా మహాలక్ష్మిప్రభాకర్, తెలుగురైతు జిల్లాశాఖ అధ్యక్షుడు

మహిళలను కించపరుస్తున్న సాక్షి మీడియాను రద్దు చేయాలి

» తెలుగు మహిళల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా భారీ నిరసన ర్యాలీ



అమలాపురంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీ

అమలాపురం టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలను కించ పరుస్తున్న సాక్షి మీడియాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగు మహిళల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. అమలాపురంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహంవద్ద నుంచి అమలాపురం గడియార స్తంభం సెంటర్ వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. సాక్షి మీడియాను రద్దు చేయాలని, మాకొద్దు ఈ సాక్షి.. షేమ్‌షేమ్ జగన్.. మహిళ గౌరవం కాపాడాలి, సాక్షి మీడియాను రద్దు చేయాలి అంటూ ప్లకార్డులు చేతబూని వందలాదిమంది మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో సాక్షి మీడియాకు వ్యతిరేకంగా ఎన్టీఆర్ విగ్రహంవద్ద నిరసన తెలిపారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలపట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని, కృష్ణంరాజులను కఠినంగా శిక్షించాలని, భారతీరెడ్డి మౌనం వీడాలని, జగన్ రాష్ట్రాన్ని వీడాలంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, అధికారి జయవెంకటలక్ష్మి, యనమదల లక్ష్మి, మాడా మాధవి, పెనుమాల సునీత, బళ్ల సత్యవతి, గెద్దాడ సత్యవాణి, యాళ్ల సుబ్బలక్ష్మి, పోతుల నాగలక్ష్మి, పేరూరి జయలక్ష్మి, నిమ్మకాయల పద్మ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, చొల్లంగి సత్యసాయిబాబా, పిచ్చిక శ్యామ్, రాజులపూడి బీముడు, మల్లుల పోలయ్య, నల్లా స్వామి, పెద్దిరెడ్డి రాము, మంథా ఫణికుమార్, నడింపల్లి ఉదయబాబు, నామాడి తారక్, మంద గెద్దయ్య పాల్గొన్నారు.



మలికిపురంలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్న రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్

అనుమతులు లేకుండా ఆక్వాసాగు


» పంటపొలాల్లో రొయ్యల చెరువుల తవ్వకాలు
» ప్రధాన కాలువ నుంచి సాగు నీరు మళ్లింపు



ఆత్రేయపురం మండలం లొల్లలాకుల-పాటిచెరువు మార్గంలో పంటకాలువ నుంచి ఆక్వా చెరువులోకి మళ్లిస్తున్న సాగునీరు

ఆత్రేయపురం,జూన్ 10(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో అనుమతులు లేకుండా రొయ్యల చెరువులు తవ్వేస్తున్నారు. పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. కోనసీమ జిల్లాలో గ్రీన్‌ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు ఆక్వా జోన్ పరిధిలో లేని అక్రమంగా తవ్విన రొయ్యలచెరువులను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఆక్వాజోన్ పరిధిలో లేని చేపల చెరువులను రొయ్యల చెరువులుగా సాగుచేస్తూ పంటపొలాలను కలుషితం చేస్తున్నారు. అధికారులు అనుమతి లేకుండా ఆత్రేయపురం మండలంలోని పంట భూములను ఆక్వా చెరువులుగా మార్చేస్తున్నారు. చెరువులను తవ్వాలంటే మత్స్య, రెవెన్యూ, భూగర్భ, వ్యవసాయ, పంచాయతీ తదితర శాఖల అధికారుల పర్యవేక్షణలో అనుమతులు తీసుకోవాలి. ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి జేసీకి నివేదిస్తారు. అనంతరం అనుమతులు పొందిన తరువాత మాత్రమే చెరువులను తవ్వాల్సి ఉంది. ఇవేమి అవసరం లేకుండానే రాజకీయ నాయకుల పలుకుబడితో దర్జాగా రొయ్యల చెరువులను తవ్వేస్తున్నారు. రొయ్యల చెరువుల సాగు పెరిగిపోవడంతో పంట భూముల సైతం రానున్న కాలంలో చౌడుబారిపోయే అవకాశం ఉంది. ఆత్రేయపురం మండలం లొల్లలాకులనుంచి పాటిచెరువుకు వెళ్లే మార్గంలో అమలాపురం కాలువ గట్టు చెంతనే 30 ఎకరాలు రెండు బిట్లలో అనుమతులు లేకుండా రొయ్యలసాగు చేస్తున్నారని ఆ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులను తవ్వి ఆక్వా సాగు చేపడుతున్నారని వాపోతున్నారు. అమలాపురం కాలవగట్టును తవ్వి మోటార్ల ద్వారా సాగునీటిని ఆక్వా చెరువులకు మళ్లిస్తున్నారు. ఏ అనుమతులు లేకుండా ఆక్వా సాగు దందా యథేచ్ఛగా సాగిపోతోంది. తాడిపూడిలో చేపల చెరువును ఉప్పునీటి చెరువుగా మార్చి రొయ్యల సాగు చేస్తున్న సంఘటనపై రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అధికార పార్టీ అండతో బుట్టదాఖలైందన ఆరోపణలున్నాయి. ఆక్వా జోన్ పరిధిలో లేని చెరువులపై జేసీ కొరడా ఝుళిపించాల్సి ఉంది. మరి కొన్ని గ్రామాల్లో కూడా అనుమతులు లేకుండా పంటపొలాలను రొయ్యల చెరువులుగా సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నట్టు సమాచారం. గ్రీన్‌ట్రిబ్యూనల్ ఆదేశాలు పకడ్బందీగా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రామచంద్రపురంలో నేడు రైతుబజార్ ప్రారంభం



రామచంద్రపురం(ద్రాక్షారామ),జూన్ 10(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో రూ.80లక్షలతో నిర్మించిన రైతుబజార్‌ను బుధవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించనున్నారు. రెండు దశాబ్దాలకు పైబడి ఎదురుచూస్తున్న రామచంద్రపురం పరిసర ప్రాంతాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కేంద్రం, 50వేల జనాభా కలిగిన పురపాలక సంఘం. అయినా ఇక్కడ రైతుబజార్‌లేదు. 2005-06లో రామచంద్రపురం పాతబస్టాండు వెనుక షెడ్డు నిర్మించి రైతుబజార్ ఏర్పాటు చేశారు. కొన్నినెలలకే అది మూతపడింది. గత ప్రభుత్వం రైతుబజార్ ఏర్పాటుకు జీవో జారీ చేసింది. రూ.కోటితో షెడ్లు నిర్మాణం జరిగింది. నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టరుకు బిల్లు చెల్లించక నిర్మాణం పూర్తి చేసి మార్కెటింగ్‌శాఖకు స్వాధీనం చేయలేదు. దీంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఇటీవల మంత్రి సుభాష్ రైతుబజార్‌ను సందర్శించి నిర్మాణం తుది దశ పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో గుంటూరు నుంచి మార్కెటింగ్‌శాఖ చీఫ్ ఇంజనీర్ ఎం.శ్రీనివాస్ పరిశీలించి రైతుబజార్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఈఈ, డీఈలను ఆదేశించారు. అధికారులు చర్యలు తీసుకోవడంతో రైతుబజార్ నిర్మాణానికి సిద్ధం చేశారు.

టీఎల్ఎంతో దివ్యాంగ చిన్నారులకు బోధన సులభతరం: డీఈవో

ముమ్మిడివరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)తో దివ్యాంగ చిన్నారులకు బోధన సులభతరమవుతుందని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల సమావేశమందిరంలో సమగ్రశిక్ష సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం ఐఈఆర్పీలకు, టీఎల్ఎం వినియోగంపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాపులో వారు మాట్లాడారు. శారీరక, మానసిక దివ్యాంగ విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన సాగించడానికి టీఎల్ఎంలు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. భవిత కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వాటిలో చిన్నారులను ఆకట్టుకునేలా బోధన సాగించాల్సిన బాధ్యత ఐఈఆర్పీలపై ఉందన్నారు. ఈ కేంద్రాలను తొలిసారిగా టీఎల్ఎం పంపిణీ చేయడంపట్ల ఐఈఆర్పీలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మెరుగైన బోధనకు టీఎల్ఎం ఉపయోగపడుతుందన్నారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని 22 భవిత కేంద్రాలకు రూ.1.60లక్షల విలువైన టీఎల్ఎం కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. టీఎల్ఎం నిపుణులు సీహెచ్ చంద్రసూర్యం, రాయుడు నాగస్వర్ణలు టీఎల్ఎం తయారీ, మెలకువలను ఐఈఆర్పీలకు వివరించారు. సమగ్ర శిక్ష ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి ప్రవీణ్‌కుమార్, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో రాంబాబు, ఏపీవో డాక్టర్ భీమారావు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించాలి

» కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ సాగు విస్తరణకు మండలాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కొబ్బరిలో అంతరపంటలుగా కోకో, పశుగ్రాసం, పశువుల కొట్టాల విస్తరణకు ఉన్న అవకాశాలను ప్రతిపాదించాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో మంగళవారం వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లావ్యవసాయ అధికారి వి.బోసుబాబు, ఉద్యాన అధికారి బీవీ రమణ, పశుసంవర్థక అధికారి వెంకట్రావు, ఎల్డీఎం కేశవవర్మ పాల్గొన్నారు.

'ప్రజాసేవలో సంతృప్తి స్థాయిలను సాధించాలి'

ప్రజాసేవలో మెరుగైన సంతృప్తి స్థాయిలను తీసుకురావాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌నుంచి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ మాధ్యమాల ద్వారా ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పనిచేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ, రేషన్, దీపం-2, వైద్య సేవలు వంటి అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. జేసీ నిషాంతి,ఆర్డీవోలు శ్రీకర్, అఖిల, మాధవి, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

'లేఅవుట్లలో ఖాళీ జాగాలను అర్హులకు అందించాలి'

లేఅవుట్లలో ఖాళీగా ఉన్న ఇంటిజాగాలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. గ్రామీణప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున అందరికీ ఇళ్లు అనే కార్యక్రమం ద్వారా అందించేందుకు అవసరమైన భూసేకరణను ప్రభుత్వపరంగా చేపట్టాలన్నారు. ఇంటి స్థలం కేటాయించిన రెండేళ్లలోపు లబ్ధిదారుడు తప్పనిసరిగా ఇంటిని నిర్మించుకోవాలన్నారు. తొలుత అమరావతినుంచి భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు.

ఎస్.యానాం సముద్రంలో ఇద్దరు యువకుల గల్లంతు

» ఒకరి మృతదేహం లభ్యం
» మరొకరి ఆచూకీ కోసం గాలింపు

7

స్కూల్ బ్యాగ్ ... బరువు తగ్గింది



1, 2 తరగతుల సెమిస్టర్-1 విద్యార్థులకు ఇచ్చే తెలుగు, ఇంగ్లీషు, గణితం కలిపి ఉన్న పాఠ్యపుస్తకం, వర్క్‌బుక్‌లు

» సెమిస్టర్ విధానంలో పాఠ్య పుస్తకాలు ముద్రణ
» 1నుంచి 9వ తరగతి వరకు రెండు సెమిస్టర్లు
» పదో తరగతికి మాత్రం పూర్వ పద్ధతిలోనే
» విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపకల్పన

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల స్కూలు బ్యాగ్ బరువు తగ్గనున్నది. విద్యాశాఖలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలను సెమిస్టర్ విధానంలో ముద్రించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో టెక్స్ట్‌బుక్స్ రూపొందించారు. పుస్తకాలు అన్నింటినీ ఒకేసారి పాఠశాలలకు తీసుకువెళ్లే ఇబ్బంది తప్పడంతో పాటు వారిపై ఒత్తిడి తగ్గేలా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా శాఖా మంత్రిగా ఉన్న నారా లోకేశ్ విద్యారంగంలో మార్పులు తీసుకురావడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరిగేలా దృష్టిసారించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆధీనంలోని పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న పాఠ్యపుస్తకాల విధానాన్ని పూర్తిగా మార్చివేశారు. విద్యార్థులపై పుస్తకాల భారం తగ్గించి, అదే సమయంలో గతంలో కంటే సులువుగా పాఠ్యాంశాలను అర్థం చేసుకునే విధంగా పుస్తకాల రూపొందించేలా చర్యలు చేపట్టి వాటిని ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి తీసుకువచ్చారు.

● ఆకర్షణీయంగా

పాఠ్యపుస్తకాలు మూస పద్ధతిలో కాకుండా అత్యంత ఆకర్షణీయంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు తమకు ఇచ్చిన పుస్తకాలను చూడగానే అందులోకి వెళ్లి చదివేందుకు ఆసక్తిగా వీటిని రూపొందించారు. ప్రతి పేజీ ఆసక్తికరంగా ఉండేలా తీర్చిదిద్దారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంగా చదివేలా వీటిని రూపొందించినట్టు విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారి తెలిపారు.

●1వ తరగతికి గతంలో 8 పాఠ్యపుస్తకాలు ... ఇప్పుడు 2+2

ప్రభుత్వ, మండల పరిషత్, మునిసిపల్, కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలోకి విద్యార్థులు ప్రవేశించగానే ఇప్పటిదాకా 8 పాఠ్యపుస్తకాలు ఇచ్చేవారు. వీటిని చూసేసరికి వారిలో ఒక విధమైన భయం కలిగేది. స్కూల్ బ్యాగ్‌లోనూ ఈ పుస్తకాల బరువు అధికంగా ఉండేది. ఇప్పుడు ఈ విధానానికి స్వస్తి పలికారు. ఇప్పుడు తెలుగు, ఇంగ్లిషు, లెక్కలుకు కలిపి ఒకే పాఠ్య పుస్తకం రూపొందించారు. దీనిని సెమిస్టర్-1కు ఒక పుస్తకం, ఒక వర్క్‌బుక్, సెమిస్టర్-2కు ఇదే రీతిలో రెండు పుస్తకాలు అందించనున్నారు. 1వ తరగతికి వచ్చే విద్యార్థి కేవలం బ్యాగ్‌లో ఒక పాఠ్యపుస్తకం, ఒక వర్క్‌బుక్ తీసుకొస్తే (నోటు పుస్తకాలు అదనం) సరిపోతుంది. రెండో తరగతికీ ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. 8 పాఠ్యపుస్తకాల స్థానంలో 2+2 పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి.

● 1 నుంచి 10వ తరగతి వరకు మారిన టెక్ట్స్ బుక్స్



పదో తరగతి పాఠ్యపుస్తకాలు

● 3 నుంచి 5వ తరగతి వరకు

3 నుంచి 5వ తరగతి వరకు గతంలో 12 పాఠ్యపుస్తకాలు ఉండేవి. ఇప్పుడు అమల్లోకి వచ్చిన సెమిస్టర్ విధానం వల్ల కేవలం నాలుగు పాఠ్య పుస్తకాలు తీసుకెళ్తే సరిపోతుంది. తెలుగు, ఇంగ్లీషు లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఒక పాఠ్యపుస్తకం, వర్క్‌బుక్, నాన్ లాంగ్వేజ్ సబ్జక్టులు లెక్కలు, పరిసరాల విజ్ఞానం (ఈవీఎస్)లకు కలిపి ఒక పాఠ్యపుస్తకం, ఒక వర్క్‌బుక్ ఉంటుంది. సెమిస్టర్-1కు నాలుగు పుస్తకాలు, సెమిస్టర్-2కు నాలుగు పుస్తకాలు ఉంటాయి.

● 6వ తరగతి నుంచి ఇలా

6వ తరగతి నుంచి 9 వరకు పాఠ్యపుస్తకాల రూపకల్పనలో సమూల మార్పులు చేశారు. ఆరో తరగతిలో పాత పద్ధతిలో 9 పాఠ్యపుస్తకాలు ఉండేవి. సెమిస్టర్ విధానం వల్ల వీటి సంఖ్య ఆరుకి తగ్గింది. తెలుగు, ఇంగ్లిషు, హిందీకి కలిసి ఒకటి ... లెక్కలు, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్‌కు వేర్వేరుగా పాఠ్యపుస్తకాలు, తెలుగు, ఇంగ్లీషుకు కలిపి ఒకటి.... లెక్కలు, సైన్స్‌సోషల్‌కు కలిపి రెడీనెస్ ప్రోగ్రాం పుస్తకాలు మొత్తం కలిపి ఆరు పుస్తకాలు రూపొందించారు. సెమిస్టర్ 1, 2లకు 6+6 విధానంలో పుస్తకాలు అందజేస్తారు. 7వ తరగతికి గతంలో 9 పుస్తకాలు, 8 కి గతంలో 14 పాఠ్యపుస్తకాలు ఉండగా, వీటిని నాలుగింటికి తగ్గించారు. లాం గ్వేజ్ సబ్జెక్టులు తెలుగు, ఇంగ్లిషు, హిందీలకు కలిపి ఒక పుస్తకం, లెక్కలు, సైన్స్, సోషల్‌కు మూడుపుస్తకాలు రూపొందించారు. సెమిస్టర్ 1, 2లకు 4+4 విధానంలో పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. 9వ తరగతికి గతంలో 17 పాఠ్యపుస్తకాలు ఉండేవి. వీటిని ఐదుకి తగ్గించారు. లాంగ్వేజ్ సబ్జెక్టులు తెలుగు, ఇంగ్లిషు, హిందీకు కలిపి ఒక పుస్తకం.... లెక్కలు, సైన్స్‌సోషల్‌కు మూడుపుస్తకాలు,ఇంగ్లిషు వర్క్‌బుక్ ఉంటాయి. వీటిని సెమిస్టర్ 1,2కు 5+5 పుస్తకాలు అందజేస్తారు.

●పదో తరగతి పాత విధానంలోనే

పదిలో సెమిస్టర్ విధానాన్ని ప్రస్తుత విద్యా సంవత్సరంలో అమలుచేయట్లేదు. పాత పద్ధతిలో 14 పాఠ్యపుస్తకాలు ఉండేవి. ఇప్పుడు 10 అందుబాటులోకి రానున్నాయి. వీరికి పూర్వ విధానంలోనే పరీక్షలు జరుగుతాయి. తెలుగు, ఇంగ్లీష్, హిందీతో పాటు లెక్కలు, ఫిజికల్, బయోలాజికల్ సైన్స్‌లు, జాగ్రఫీ, ఎకనామిక్స్, హిస్టరీ పాఠ్యపుస్తకాలు, ఇంగ్లీషువర్క్‌బుక్‌అందజేస్తారు.

● డిక్షనరీలు

విద్యార్థులకు డిక్షనరీలు అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. 1వ తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ, 6వ విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందజేస్తారు. ఇప్పటికే ఇవి మండల కేంద్రాలకు చేరాయి. దీనివల్ల ఇంగ్లిషుపై విద్యార్థులకు పట్టు పెరుగుతుందని భావిస్తున్నారు.

● పరీక్షా విధానంలో మార్పులు

మారిన పాఠ్యపుస్తకాలకు అనుగుణంగా పరీక్షల విధానంలోనూ మార్పులు చేశారు. గతంలో ఫార్మాటివ్ ఎసెస్‌మెంట్లుగా వ్యవహరించే యూనిట్ టెస్టులను ఇక సెల్ఫ్ఎసెస్‌మెంట్ టెస్టులుగా పిలుస్తారు.సెమిస్టర్-1కు రెండు, సెమిస్టర్-2 రెండుటెస్టులు ఉండనున్నాయి. సెమిస్టర్-1కు సంబంధించి సమ్మేటివ్ ఎసెస్‌మెం ట్-1 నిర్వహిస్తారు.సమ్మేటివ్ఎసెస్‌మెంట్‌లో మాత్రం సెమిస్టర్-2, 1కు సంబంధించి సబ్జెక్టులతో ప్రశ్నలుంటాయి. అయితే విద్యార్థులు సెమిస్టర్-1 పూర్తైన తర్వాత ఆ పుస్తకాలను పాఠశాలలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. దీంతో విద్యార్థుల స్కూల్‌బ్యాగ్‌లో బరువు తగ్గుతుంది. మారిన విధానంలో విద్యార్థులు మరింత సులభంగా, ఆసక్తిగా పాఠ్యాంశాలు నేర్చుకునే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు చెప్తున్నారు.



3 నుంచి 5వ తరగతుల పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌లు



6 నుంచి 9వ తరగతి పాఠ్యపుస్తకాలు

డీజీ లక్ష్మీల చేతికి...
సీఎల్ఎఫ్ సేవలు

● ఎస్‌హెచ్‌జీలో మహిళల స్వయం ఉపాధికి మరో పథకం
● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 902 మంది మహిళలు ఎంపిక
● డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్‌లో నైపుణ్యం ఉన్న మహిళలకు ఛాన్స్
● మీ సేవా కేంద్రాల్లోని అన్ని సేవలూ ఈ సెంటర్ల ద్వారా పొందవచ్చు
● జూన్ నెలాఖరుకి ప్రారంభం చేందుకు మెప్మా సన్నాహాలు



కాకినాడ కార్పొరేషన్ మెప్మా కార్యాలయంలో డిజిటల్ లక్ష్మిగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న అభ్యర్థులు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి):డిజిటల్ ఇండియాలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పట్టణాల్లో స్లమ్ లెవల్ ఫెడరేషన్(ఎస్ఎల్ఎఫ్) డిజిలక్ష్మి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. మీసేవా కేంద్రాల్లో అందించే వివిధ రకాల డిజిటల్ సేవలను ఇకపై ఈ సెంటర్లలో ఎంపికైన పొదుపుసంఘాల మహిళలు అందించనున్నారు. మహిళల ఎంపిక రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుంది. ఈ నెలాఖరుకి ఇవి ప్రారంభం కానున్నాయి.

● సెంటర్‌కి ఒక్కరు..

సెంటర్‌కి ఒక్కరు ఉపాధి పొందవచ్చు. నెలకు రూ.15 నుంచి రూ.20వేల వరకు ఆదాయం వస్తుంది. ఈ సెంటర్ల ఏర్పాటుకు పట్టణ ప్రాంతాల్లోని స్లమ్ లెవల్ సమాఖ్య(ఎస్ఎల్ఎఫ్) పరిధిలోని పొదుపు సంఘం నుంచి డిగ్రీ చదివిన వారిని ఎంపిక చేస్తున్నారు. ఒక్కొక్క ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 25 స్వయం సహాయక సంఘాలు ఉంటాయి. వీటిలో 250 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్క ఎస్ఎల్ఎఫ్ నుంచి ఒక మహిళను డీజీ లక్ష్మీ సేవలకు ఎంపిక చేస్తున్నారు. ఎంపికైన మహిళకు రూ. రెండు లక్షల రుణం అందిస్తారు. ఈ మొత్తంతో కంప్యూటర్, దానికి అనుబంధ పరికరాలు సమకూర్చుకోవచ్చు.

● సేవలు ఇలా..

ఈ డీజీ లక్ష్మీల ద్వారా ఈశ్రమ్, రేషన్ కార్డులు, పాస్‌పోర్టు, ఆధార్, ఓటరుకార్డు, జనన, మరణ ధృవీకరణల మంజూరు, బ్యాంక్ ఖాతా తెరవడం, డబ్బులు డిపాజిట్, విత్‌డ్రా వంటి బ్యాంకింగ్ సేవలు ఉంటాయి. ఈ విద్యార్థులకు సర్టిఫికెట్లు, వివిధ కోర్సుల్లో చేరడానికి నమోదు, ఆరోగ్యబీమా పాలసీలు, వ్యవసాయ సేవలందిస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 902కి ఇప్పటికే 500 మంది ఎంపికయ్యారు. కాకినాడ జిల్లాలో 450 కి 296 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 319 కి 116 మంది, అంబేద్కర్ కోనసీమలో 133కి 87 మంది డీజీ లక్ష్మీలుగా ఎంపికయ్యారు.

●మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు

పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు వివిధ రూపాల్లో ఉపాధి పొందేందుకు తోడ్పాటును కల్పిస్తుంది. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో డీజీ లక్ష్మీ కామన్ సర్వీస్ సెంటర్ల (ఎస్ఎల్ఎఫ్) ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఈ సెంటర్ల ద్వారా ప్రజలకు డిజిటల్ సేవలు అందిస్తూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా ఈ పథకం రూపొందించబడింది.

● అర్హతలు ఇవీ ...

స్వయం సహాయక సంఘాల్లో మూడేళ్లు తప్పనిసరిగా పొదుపు చేసి ఉండాలి.
- 21 నుంచి 45 సంవత్సరాల వయస్సు .
- డీజీ లక్ష్మీ పథకానికి ఎంపికైన మహిళలకు రూ.రెండు లక్షల రుణం ఇస్తారు.
- ఈ మొత్తంతో డిజిటల్ సేవలు అందించేందుకు గాను కంప్యూటర్, అవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తారు.
- ఇంకా మిగిలిన మొత్తంతో కామన్ సర్వీస్ సెంటర్లలో జిరాక్స్ వంటి ఇతరత్రా వ్యాపారాలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- సీఎస్సీ సేవలు అందించే ఈ గవర్నెన్‌లో మెప్మా త్వరలో ఒప్పందం కుదుర్చుకోనుంది.

● లక్ష్యం చేరేందుకు కృషి

- బి.ప్రియంవద, పీడీ, మెప్మా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

డిజిలక్ష్మి లక్ష్మీ కార్యక్రమంలో జిల్లాకు 300 మంది లక్ష్యంగా ఇచ్చారు. మున్సిపాల్టీల వారీగా ఇచ్చిన లక్ష్యాలను అందుకునేందుకు మహిళలకు అవగాహన కల్పించి దరఖాస్తులు చేసుకునేలా చర్యలు చేపట్టాం. ఎంపికైన మహిళలకు శిక్షణ ఇస్తాం. తర్వాత కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తారు.

ఆగ్రహ జ్వాలలు

» సాక్షి మీడియాపై మిన్నంటుతున్న నిరసనలు
» రాజానగరంలోని సాక్షి పత్రిక ముద్రణా కార్యాలయం వద్ద కూటమి నిరసన
» సాక్షి పత్రిక ప్రతులు దగ్ధంచేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహిళలు
» సాక్షి నేమ్ హోర్డింగ్ ధ్వంసం
» హోర్డింగ్ తొలగింపులో రక్తం కారుతున్నా ఆగని ఆగ్రహావేశాలు
» సాక్షి చానల్ అనుమతులు రద్దు చేయాలి
» పోలీసులు అడ్డుకున్నా ఆగని ఆందోళనలు
» వైఎస్ భారతీరెడ్డి క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు



ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సాక్షి ముద్రణ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు



ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న మహిళలు

రాజానగరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాక్షి మీడియాపై మహిళల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. ఆందోళనకారులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం లేకపోయింది. నవ్యాంధ్ర రాజధాని అమరావతి, మహిళలపై సాక్షి మీడియా చేసిన అసభ్య వ్యాఖ్యలను నిరసిస్తూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో భారీసంఖ్యలో తరలివచ్చి రాజానగరంలోని సాక్షి ముద్రణా కార్యాలయం వద్దకు మంగళవారం చేరుకుని ఆందోళన చేపట్టారు. అమరావతి మహిళలపై సాక్షి మీడియా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. సాక్షి ముద్రణ కార్యాలయానికి సంబంధించిన స్టీలు అక్షరాల హోర్డింగ్‌ను మహిళలు ధ్వంసం చేశారు. హోర్డింగ్ తొలగింపులో మహిళ చేతులు తెగి రక్తం కారుతున్నా, పోలీసులు వారిస్తున్నా లెక్కచేయకుండా సాక్షి హోర్డింగ్‌ను ధ్వంసం చేసేవరకు మహిళల ఆగ్రహావేశాలు ఆగలేదు. మహిళలను కించపరిచేవిధంగా వ్యాఖ్యలు చేసిన సాక్షి మీడియా అనుమతులు రద్దు చేయాలని, వైఎస్.భారతీరెడ్డి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ పెద్దఎత్తున నినదిస్తూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో కలిసి మహిళలు భారీ సంఖ్యలో కార్యాలయం ఎదుట బైఠాయి ంచారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరా మకృష్ణ ఆధ్వర్యంలో భారీసంఖ్యలో మహిళలు, వీరమహిళలు, జనసైనికులు చేరుకుని వైస్.భా రతి, సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముద్రణ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరాతిపై జగన్ విషం కక్కుతున్నారు

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

గత ఐదేళ్లుగా విధ్వంసపాలన చేసిన జగన్మో హన్‌రెడ్డికి అభివృద్ధి కంటే రాక్షస పాలనే ధ్యే యంగా పాలన సాగించారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ఎక్కడ ఉందో చెప్పలేని పరిస్థితుల్లో కాలం గడిచిపోయిందన్నారు. ఇప్పుడు అద్భు తమైన అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా రావడంపై సంతోషించడంమాని ఈరోజు అమరావతిపై జగన్ విషం కక్కుతున్నారన్నారు. అమరావతిపై సాక్షి మీడియాలో మహిళలను కించపరిస్తూ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకర మన్నారు. దీనికి జగన్, వైఎస్ భారతి బాధ్యత వహిస్తూ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి రాకూడదనే దురుద్దేశ్యంలో అటువంటి చర్యలకు పూనుకుంటున్నారన్నారు. మహిళలను కించపరిచిన జర్నలిస్టులను సాక్షి మీడియా నుంచి తొలగించాలని ఎమ్మెల్యే బత్తుల డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి

● అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన వారిపై తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గత ఐదేళ్లు జగన్మోన్‌రెడ్డి మహిళలను కించపర్చడం, అమరాతి కోసం సహకరించిన రైతులనుసైతం కించపరుస్తూ వచ్చారు. మహిళలను కూడా చూడకుండా దాష్టీకం చేశారన్నారు. మహిళల శీలాన్ని కించపరుస్తూ సొంత మీడియాలో తీవ్రమైన వ్యాఖ్యలు చేశారన్నారు. తక్షణమే సాక్షి మీడియాను రద్దు చేయాలని, భారతీరెడ్డిని, కృష్ణంరెడ్డిని అరెస్టుచేసి చట్టపరమైన శిక్ష విధించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హెచ్చరిస్తున్నామన్నారు.

సంప్రదాయం ఉట్టిపడేలా
మరిడమ్మ ఉయ్యాల తాళ్ల ఉత్సవం

పెద్దాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం భక్తులతో కొలవబడే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఉయ్యాలతాళ్ల ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమి నాడు అమ్మవారి జాగరణ ఉత్సవానికి 15 రోజుల ముందు ఈ ఉయ్యాల తాళ్ల ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించడం గత కొన్ని సంవత్సరాలుగా ఆచారంగా వస్తోంది. అన్ని సామాజికవర్గాలకు చెందిన ప్రజలు ఈకార్యక్రమంలో పాల్గొని నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలోని కోట ముందుకు చెందిన దళిత యువకులు రైతులు ఇచ్చిన రెండు తాటి చెట్లకు ప్రత్యేక పూజలుచేసి వాటిని నరికి పట్టణ వీధులగుండా మోసుకుంటూ తీసుకురావడం రివాజుగా వస్తోంది. ప్రత్యేక డప్పు వాయిద్యాలు, గరగలతో వాటిని మోసుకువచ్చి భాజాభజంత్రీలు నడుమ తీసుకువచ్చిన తాటిచెట్లతో మరిడమ్మ అమ్మవారి ఆలయం ముందు ఊయ లవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కురంవిజయలక్ష్మీ, సిబ్బంది రమణ, శివ అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



ఉయ్యాల తాళ్ల ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు

ఏజెన్సీ సమీప గ్రామాలకు
ఆర్టీసీ సేవలు నిలిపివేత



పురుషోత్తపట్నం ఆర్‌టీసీ బస్సును సీతానగరం బస్టాండ్ వద్ద నిలపివేసిన పోలీసులు

సీతానగరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) పురుషోత్తపట్నం గ్రామం ఏజెన్సీ ఏరియాకు అతి సమీపంలో ఉండడంతో మంగళవారం సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులను సీతానగరం పోలీసులు నిలిపివేశారు. రాష్టబంద్‌కు నక్సలైట్లు పిలుపునివ్వడంతో అధికారుల ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నుంచి పురుషోత్తపట్నం వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు సుమారు 30మంది ప్రయాణికులతో రాజమహేంద్రవరం నుంచి పురుషోత్తపట్నం వెళుతూ సీతానగరం బస్టాండ్‌వద్దకు చేరేసరికి సీతానగరం పోలీసులు నిలపివేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏజన్సీ సమీపంలో ఉన్న పురుషోత్తపట్నం బస్సులు వెళ్లడానికి వీలులేదని చెప్పడంతో కండక్టర్ ప్రయాణికులను సీతానగరం బస్టాండ్‌వద్దనే దింపేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆటోలలోను ప్రైవేటు వాహనాలలోను గమ్యస్థానం చేరుకున్నారు.

నేడు జగన్నాథపురంలో
ఏరువాక కార్యక్రమం

గోపాలపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఏరువాక పూర్ణిమ సందర్భంగా ప్రతీఏటా ఖరీఫ్ సీజన్ ముందు ఏరువాక కార్యక్రమాన్ని రైతులు నిర్వహిస్తుంటారు. అందులోభాగంగా ఈ ఏడాది మండలంలోని జగన్నాధపురం గ్రామంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వ్యవసాయాధికారి రాజారావు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జిల్లా కలెక్టర్ పీ.ప్రశాంతి, జిల్లా వ్యవసాయాధికారి వస్తారన్నారు. రైతులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.



ఏరువాక కార్యక్రమానికి ముస్తాబవుతున్న ఎడ్లబండి

ఎమ్మెల్సీ పేరాబత్తులకు ఉపాధ్యాయసంఘాల సత్కారం



ఎమ్మెల్సీ పేరాబత్తులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కాకినాడరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రభుత్వం ఎస్జీటీలకు తలపెట్టిన వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దుచేసి మాన్యువల్‌గా కౌన్సెలింగ్ జరిపించాలని కోరుతూ పలు ఉపాధ్యాయ సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరాన్ని కలిసి కోరారు. ఆయన ఈ సమస్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా జరిపేందుకు అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం ఎమ్మెల్సీ రాజశేఖరాన్ని ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటరమణ, శ్రీనివాస్, కామేశ్వరరావు, కాశీ విశ్వనాథ్, జ్యోతి, చినబాబు, రామకృష్ణ, శ్రీను, సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వీయ పరిరక్షణతో...
కొవిడ్‌కు చెక్!

- దేశంలో కలకలం రేపుతున్న కేసులు
- నిర్లక్ష్యం వద్దంటున్న వైద్య నిపుణులు
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు





జీజీహెచ్ (కాకినాడ) జూన్10 (ఆంధ్రజ్యోతి): కొవిడ్- 19 కరోనా వైరస్ రకరకాల వేరియంట్‌లలో ప్రపంచవ్యాప్తంగా అతి వేగంగా గాలిలో విస్తరించి అన్ని దేశాలను అతలాకుతలం చేసి లక్షల్లో ప్రజలను మృత్యుఒడికి తీసుకెళ్లింది. కుటుంబ వ్యవస్థ కకావికలమై ఆఖరికి రక్తం పంచుకు పుట్టినవారిని కడచూపు చూసుకోలేని దుస్థితిని తెచ్చింది. రెండున్నరేళ్లు విరుచుకుపడిన వైరస్ మహమ్మారి జనాలను మింగేసిన తరువాత శాంతించింది. కుటుంబాలను కోల్పోయి పీడకలలాంటి చేదు జ్ఞాపకాల నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న సమాజాన్ని మళ్లీ కరోనా వైరస్ మరో వేరియంట్‌లో కలవరం పెడుతోంది. దీంతో ప్రపంచం మరోసారి భయంతో వణికిపోతుంది. అయితే గతంలో వేరియంట్‌లంత ప్రభావం ప్రస్తుత వైరస్‌లో లేకపోయిన అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరమని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. స్వీయ పరిరక్షణతో కొవిడ్‌కు చెక్ పెట్టవచ్చని వారు సూచిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు..

కొవిడ్ కేసులు పెరగడానికి వ్యాధినిరోధక శక్తి క్షీణించడం ప్రధాన కారణం. ఇలా ఉన్నవారికి త్వరితగతిన వైరస్ సోకుతుంది. భారతదేశంలో తాజాగా కరోనా కేసులు పెరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కొవిడ్ వ్యాప్తిపై ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వైరస్ లక్షణాలు ఉన్నవారికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు పెంచాలని సూచించింది. దుష్పరిణామాలు చోటుచేసుకోకుండా ఉండాలంటే వైద్య చికిత్స కన్నా ముందుగా స్వీయ పరిరక్షణతో కూడిన ముందస్తు జాగ్రత్త చర్యలు పాటిస్తే కరోనా మహమ్మారికి చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మాస్క్‌లు పెట్టుకోవడం, భౌతికదూరం పాటించడం, చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, వంటిని,ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలంటున్నారు.

జీజీహెచ్‌లో అన్ని వసతులతో కూడిన వైద్యం



జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగంలో 26 ఐసీయూ పడకలతో కూడిన ప్రత్యేక కొవిడ్ వార్డును ఏర్పాటు చేశాం. వెంటిలేటర్‌లు, మందులు, మెడిసన్, పల్మనాలజీ, అనస్థీషియా వైద్య నిపుణులతో 24 గంటలు నిరంతరప్రాయంగా వైద్య సేవలందించేందుకు సంసిద్ధంగా ఉన్నాం. ఈ ఏడాది కరోనా వైరస్ కొత్త వేరియంట్ రూపుదాల్చిన నాటి నుంచి ఇప్పటివరకు కాకినాడ జీజీహెచ్‌లో 399 కొవిడ్ టెస్టులు చేయగా వారిలో 54 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అయితే వీరిలో నలుగురు జీజీహెచ్‌లో చేరి చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం మరో ఆరుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. దగ్గు, జలుబు, నిరంతరప్రాయంగా ముక్కు నుంచి నీరు కారడం తదితర లక్షణాలుంటే వెంటనే జీజీహెచ్‌కు వచ్చి ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ చేయించుకోవాలి. ముఖ్యంగా మాస్క్ పెట్టుకోవడం, సబ్బుతో చేతులను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవడం, ఎప్పటికప్పుడు శానిటైజ్ చేసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ స్వీయ పరిరక్షణ పాటిస్తే కరోనాకు చెక్ పెట్టవచ్చు.

డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్

ఆంజనేయస్వామి విగ్రహాన్ని బయటపడేసిన దుండగులు

కాకినాడ జిల్లా తొండంగి మండలం చింతకాయలపేట గ్రామంలో ఘటన

తొండంగి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం పెరుమాళ్ళపురం శివారు చింతకాయలపేటలో గుర్తుతెలియని దుండగులుఆంజనేయస్వామి విగ్రహాన్ని గుడి నుంచి తీసుకొచ్చి బయటపడేశారు. మంగళవారం ఉదయం సీతారాముల ఆలయంలో ఉన్న ఆంజనేయ విగ్రహాన్ని గుడిబయట పడేసి ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. విగ్రహానికి ఉన్న కిరీటం కొంతమేర ధ్వంసమైంది. ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలు ఉండగా నమస్కార ముద్రలో ఉన్న ఆంజనేయ విగ్రహాన్ని పీఠంతో సహాబయటకు తీసుకొచ్చి బయటపడేశారు. ముందు హాలులో ఉన్న ఫ్యానుకు కొంతమేర నష్టం కలిగించారు. మద్యం మత్తులో ఉన్న ఆకతాయిల పనై ఉండొచ్చని కొందరు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, విచారణ జరిపి నిందితులను త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. హనుమాన్‌దళ్ అధ్యక్షుడు గణేష్ కన్నా, వెంకటరాయుడు ఆలయాన్ని పరిశీలించారు.



బయటపడేసి ఉన్న విగ్రహం



వంచేసిన ఫ్యాను రెక్కలు

బీచ్‌లో స్నానానికి దిగి యువకుడి మృతి

▸ మరొకరు గల్లంతు ▸ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో ఘటన



మరణించిన హరికిశోర్ (ఫైల్)

ఉప్పలగుప్తం/ అంబాజీపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్ వద్ద మంగళవారం యవకుడు మృతిచెందగా మరొకరు గల్లంతయ్యారు. అంబాజీపేట, అయినవిల్లి మండలాలకు చెందిన ఐదుగురు యువకులు ఎస్.యానాం బీచ్‌కు వచ్చి సముద్రంలో స్నానాలకు దిగారు. వారిలో అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యాళ్ళ హరికిశోర్(19), అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన ఇసుకపట్ల జస్వంత్(19) సముద్రంలో గల్లంతయ్యారు. జస్వంత్‌ను కాపాడే ప్రయత్నంలో హరికిశోర్ గల్లంతయినట్టు సహచరులు చెపుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న ఉప్పలగుప్తం ఎస్ఐ సీహెచ్ రాజేష్ సంఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. హరికిశోర్ మృతదేహం లభ్యం కాగా జస్వంత్ కోసం గాలిస్తున్నారు.

మాచవరంలో విషాదఛాయలు

హరికిశోర్ మృతితో మాచవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుసుమవారిపేటలో కిశోర్ తల్లి నాగమణితో కలిసి అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. అతడి స్వగ్రామం పి.గన్నవరం కాగా మాచవరం కుసుమవారిపేటలోని అమ్మమ్మ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఓ ప్రవేట్ కంపెనీలో రికవరీ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. కాగా తండ్రి కుమార్ ఎస్.యానాంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. కిశోర్ మృతి విషయం తెలిసి తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. స్థానికులు కన్నీటి పర్యాంతమయ్యారు. కిశోర్ తల్లి అమలాపురం ఏరియా ఆసుపత్రికి చేరుకుంది.

ఐషర్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



సత్తిబాబు (ఫైల్)

ఏలేశ్వరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మంగళవారం చిన్నింపేట గ్రామానికి చెందిన రఘుమండ సత్తిబాబు (32) మృతిచెందాడు. స్వగ్రామం నుంచి సైకిల్‌పై తాను పని చేసే అవంతి కర్మాగారానికి వెళ్తుండగా మార్గంమధ్యలో విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన సత్తిబాబును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. అతడికి తలిదండ్రులు, అన్నయ్య ఉన్నారు. తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు.

ట్యాంకు పై నుంచి దూకి...



మరణించిన సూరిబాబు

మండపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట పట్టణంలోని బూరగుంట చెరువు వద్ద పురాతన వాటర్ ట్యాం కు పై నుంచి దూకి వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా వేట్లపాలెనికి మోర్త సూరిబాబు (30) భార్యతో కలిసి మండపేట మరదలు ఇంటికి వచ్చాడు. మతిస్థిమితం లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వాటర్ ట్యాంకు మెట్లు ఎక్కుతుండటంతో సమీపంలో ఫైలేరియా కార్యాలయ సిబ్బంది చూసి ట్యాంకు పైకి ఎక్కవద్దని వారించడంతో వెనుకవైపు సందులోకి దూకేశాడు. తీవ్ర గాయాలైన సూరిబాబును 108 అంబులెన్సులో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ తరలిస్తుండగా మృతి చెందినట్టు తెలిపారు. సూరిబాబుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ చంటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో పడి...

కె.గంగవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి గోదావరిలో పడి వ్యక్తి మృతి చెందాడు. పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం తోటపేట గ్రామానికి చెందిన అల్లం రాజేష్ (35) సోమవారం కోటిపల్లి గుడికి వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరి తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం కోటిపల్లి సుందరపల్లి సరిహద్దుల్లో గోదావరిలో మృతదేహాన్ని గుర్తించారు. అది రాజేష్‌గా నిర్ధారణ అయ్యిందని, పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జానీ బాషా పేర్కొన్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

సామర్లకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో పెదబ్రహ్మదేవం గ్రామం రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతున్న వృద్ధురాలిని వేగంగా వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. రైల్వే పోలీసులు అందించిన సమాచారం మేరకు.. మరణించిన వృద్ధురాలిని పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన తోటకూర సీతమ్మ (74)గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గత కొంతకాలంగా మతిస్థిమితం లేని సీతమ్మను ఇంటి వద్దే ఉంచి మంగళవారం సమీప బంధువుల ఇంట జరిగిన శుభ కార్యక్రమానికి వెళ్లగా వృ ద్ధురాలు ఇంటి నుంచి పట్టాల వద్దకు చేరుకుని పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు, కేసు నమోదు చేసిటన్టు దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

డీజిల్ తరలిస్తున్న వ్యాన్ సీజ్

తాళ్లరేవు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడకు అక్రమంగా డీజిల్‌ను తరలిస్తున్న బొలెరో వ్యాన్‌ను తాళ్లరేవు మండలం పోలేకుర్రు చెక్ పోస్టు వద్ద మంగళవారం పట్టుకున్నట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి 850 లీటర్లు డీజిల్‌ని స్వాధీనం చేసుకున్నా మన్నారు. డీజిల్ తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.



వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఉమ్మడి జిల్లా పరిధిలో.. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల బదిలీలు

సామర్లకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పలు మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్లను, మున్సిపల్ ఏఈలను బదిలీ చేస్తూ మున్సిపల్ ఇంజనీర్-ఇన్-చీఫ్ తాడేపల్లి కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాకినాడ కార్పొరేషన్‌గా డీఈఈగా పనిచేస్తున్న కేవీవీ సత్యనారాయణను అమలాపురం మున్సిపాల్టీకి బదిలీ చేశారు. అమలాపురం డీఈఈగా పనిచేస్తున్న సీహెచ్ నాగసతీష్‌ను తుని మున్సిపాల్టీకి, రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఏపీ టిడ్కో డీఈఈ పి.రాజును పిఠాపురం మున్సిపాల్టీకి, కాకినాడ కార్పొరేషన్ ఎంఏఈ కె.కళ్యాణిని సామర్లకోట మున్సిపల్ ఏఈగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఏఈ ఎం.రమేష్‌బాబును రాజమహేంద్రవరం కార్పొరేషన్‌గా బదిలీ చేశారు. కాకినాడ కార్పొరేషన్ ఎంఏఈగా వై.కమలహాసన్‌ను పిఠాపురం మున్సిపల్ ఎంఏఈగా, పిఠాపురం మున్సిపల్ ఎంఏఈ కె.రత్నావలీ కాకినాడ కార్పొరేషన్ ఎంఏఈగా, రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎంఏఈగా పి.సూర్యప్రకాశరావును ఏలేశ్వరం నగర పంచాయతీకి బదిలీ చేశారు. ఏలేశ్వరం నగర పంచాయతీ ఎంఏఈ కుమారిరెడ్డి అనూషలక్ష్మిని మండపేట మున్సిపల్ ఏఈగా బదిలీ చేశారు. మండపేట మున్సిపల్ ఏఈగా పనిచేస్తున్న బి.ఆంజనేయులును రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎంఏఈగా బదిలీ చేశారు. అమలాపురం మున్సిపల్ ఏఈ కె.వెంకటేష్ (పర్యావరణం)ను జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీకి బదిలీ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ ఎంఏఈ పీవీ సుధాకర్‌ను పెద్దాపురం మున్సిపల్ ఏఈగా, గుడివాడ మున్సిపల్ ఏఈ ఎస్‌కే రఫీని ఏలూరు మున్సిపల్ ఏఈగా, జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఏఈ పి.జ్వాలాదీప్తి మచిలీపట్నం మున్సిపల్ ఏఈగా, తణుకు మున్సిపల్ ఏఈ ఎండీ అహ్మద్ ఆలీషా గొల్లప్రోలు నగర పంచాయతీ ఎంఏఈగా, గొల్లప్రోలు నగర పంచాయతీ ఎంఏఈ ఎన్.ప్రభాకరరావు రామచంద్రపురం మున్సిపల్ ఏఈగా బదిలీ అయ్యారు. వీరు సత్వరం తమ ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ అయ్యి బదిలీ ఉత్తర్వుల మేరకు నూతన స్థానాల్లో బాధ్యతలు చేపట్టాలని ఈఎన్‌సీ ప్రభాకరరావు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రెవెన్యూ శాఖలో 61 మంది బదిలీలు

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెవెన్యూశాఖలో 61 మందిని బదిలీ చేశారు. కాజులూరు తహశీల్దార్‌గా జీఆర్ ఠాగూర్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో కెఆర్ఆర్‌సీ తహశీల్దార్‌గా ఉన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్ ఏ.తాతారావును శంఖవరం తహశీల్దార్‌గా నియమించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో తహశీల్దార్‌గా పనిచేస్తున్న విద్యావతిని అంబేద్కర్ కోనసీమ జిల్లా బదిలీ చేశారు. కాకినాడ జిల్లాలో కోటనందూరు తహశీల్దార్ టీ.సుభాష్‌ను కోనసీమ జిల్లా బదిలీ చేశారు. కోనసీమ జిల్లాలో రామచంద్రపురం తహశీల్దార్ ఎం.సావిత్రిని అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అల్లూరు సీతారామరాజు జిల్లాలో వీఆర్‌పురం తహశీల్దార్ సరస్వతిని, రంపచోడవరంలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవో రమణినీ కాకినాడ జిల్లాకు బదిలీ చేశారు. మొత్తం 61 మంది సాధారణ బదిలీల్లో బదిలీకాగా దీనిలో 7మంది తహశీల్దార్లు, 27 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 14 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఏడుగులు ఆఫీస్ సబార్డినేట్‌లున్నారు.

అన్నవరం దేవస్థానంలో ఉద్యోగుల బదిలీలు

అన్నవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం నుంచి ఆరుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా ఏఈవో పాలంకి జగ్గారావును సింహాచలం దేవస్థానానికి, సూపరింటెండెంట్ వి.సూర్యనారాయణ మూర్తిని విజయవాడ దేవస్థానానికి, సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో ఉన్న ఏ.శ్రీనివాసరావు ద్వారకా తిరుమలకు, ఎం.శ్రీనివాసరావును విజయవాడకు, జూనియర్ అసిస్టెంట్ కొంతం సతీష్ విజయవాడకు, బి.పవన్‌కుమార్‌ను ద్వారకా తిరుమలకు బదిలీ చేశారు. గతంలో అన్నవరం దేవస్థానం పేరెంట్ ఇన్‌స్టిట్యూట్ కలిగి ఇతర ఆలయాల్లో పనిచేస్తోన్న వారంతా తిరిగి సొంతగూటికి చేరుకుంటున్నారు.

కూనవరం అటవీశాఖాధికారి బదిలీ

కూనవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూనవరం అటవీ అధికారి కరుణాకర్ బదిలీ అయ్యారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రేంజ్‌కు బదిలీ అవ్వడం జరిగింది. కరుణాకర్ కూనవరం మండలంలో 8 నెలలు మాత్రమే పనిచేసినా విధుల్లో కీలక పాత్ర నిర్వహించారు. కొన్నినెలలు క్రితం ఈ ప్రాంతంలో అడవుల్లో సంచరించిన పెద్ద పులిని మళ్లీ దట్టమైన అడవుల్లోకి పంపించిన దాంట్లో కరుణాకర్ బృందం కీలకంగా వ్యవహరించింది.

ప్రత్తిపాడులో చోరీ

రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

ప్రత్తిపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో మంగళవారం సాయంత్రం ఓ ఇంట్లో దొంగలు పడి రూ.6లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. ప్రత్తిపాడు బైపాస్ రహదారిలో స్వామివివేకానంద విగ్రహం వద్ద ఉన్న నరేంద్రగిరి కొండ ఎదురుగా ఉన్న కంటిపూడి శివానంద భాస్కరరావుచౌదరికి చెందిన భవనంలో ఈ చోరీ జరిగింది. బీరువాలో ఉన్న 3 బంగారు నల్లపూసలహారాలు, 2.1 కిలోల వెండి కంచాలు, తదితర సామాగ్రిని అపహరించారు. భాస్కర చౌదరి లేని సమయంలో దుండగులు ఈ చోరీ జరిగినట్టు తెలుస్తుంది. దీనిపై సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతంలకు సమాచారం అందడంతో వారితోపాటు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు కూడా ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ చోరీ ఘటనలో ఇద్దరు ఇంటి వద్దకు రాగా మరో ఇద్దరు నిరీక్షించినట్టు పోలీసులు గుర్తించారు. క్లూస్ టీం కూడా రంగంలోకి దిగి నిందితుల వేలిముద్రలు, ఇతర ఆధారాల సేకరణ నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



చోరీ జరిగిన ఇంటిలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

మోతుగూడెంలో వాహనాల తనిఖీ

మోతుగూడెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం ఆంధ్ర - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా చత్తీస్‌ఘడ్‌లో వరుస ఎదురుకాల్పుల్లో జరగడం, మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పోలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ బసవ రాజు అలియాస్ నంబాల కేశవరావుతో పాటు 27 మంది మావోయిస్టులు మృతిచెందడంతో ఈ నెల 10న భారత బంద్‌కు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మోతుగూడెం పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్ఐ సాదిక్ ఆధ్వర్యంలో మోతుగూడెం ప్రధాన రహదారులు, పోలీస్ చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. మంగళవారం పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేపట్టి అనుమానిత వ్యక్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వాహనాలు నిలిపి వాహన రికార్డులను పరిశీలించారు. వాహనాల్లో ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సివిల్ పోలీసులు ఏఎస్ఐ రాజేశ్వరరావు, ట్రైనింగ్ ఎస్ఐలు పోలీస శ్రీను, సీఆర్పీఎఫ్ ఏ/42 సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సాదిక్

పిల్లలతో వివాహిత అదృశ్యం



అదృశ్యమైన దుర్గాదేవి, పూర్ణ, వెంకట సాయి

ధవళేశ్వరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి పిల్లలతో భర్త వద్దకు వెళుతున్నానని చెప్పి వెళ్లిన వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని కంచరపాలెంలో భర్త ప్రభుకుమార్, ఇద్దరి పిల్లలతో జీవిస్తున్న 34 ఏళ్ల జె.దుర్గాదేవి ఏప్రిల్‌లో తూర్పు గోదావరి జిల్లా ధవలేశ్వరం వద్ద ఎర్రకొండపై నివసిస్తున్న తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. తిరిగి మే 3న విశాఖపట్నం భర్త వద్దకు వెళ్లిపోతున్నానని పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భర్త వద్దకు వెళ్లకుండా తిరిగి ధవళేశ్వరంలోని తల్లిదండ్రుల వద్దకు రాకుండా అదృశ్యమైంది. తన కుమార్తె, మనవలు ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు మంగళవారం ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వారి ఆచూకీ తెలిస్తే 94407 96586 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఆసుపత్రి నుంచి వ్యక్తి...



రామకృష్ణ

పిఠాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పిఠాపురం మండలంలోని మంగితుర్తికి చెందిన పోలవరపు రామకృష్ణ(45)కు మే 31న ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆసుపత్రిలో చేర్పించారు. జూన్ 1న మధ్యాహ్నం 2.45గంటలకు తాను భోజనం పడుకుని ఉండగా ఆసుపత్రి నుంచి రామకృష్ణ వెళ్లిపోయినట్టు అతడి భార్య లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆసుపత్రి నుంచి వెళ్లే సమయంలో రామకృష్ణ ఆకుపచ్చ కలర్ ఫ్యాంటు, నీలం రంగుపై తెల్లని చారల షర్టు ధరించాడు. అతడి ఆచూకీ తెలిసినవారు పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో లేదా ఫోన్ నెంబర్లు 90301 31290, 9381992472, 9014194663, 8500005621కు తెలియజేయాలని పోలీసులు సూచించారు.

తప్పిపోయిన మూడేళ్ల బాలుడు
గంట వ్యవధిలోనే అప్పగింత

గొల్లప్రోలు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన మూడేళ్ల బాలుడి ఆచూకీని గంట వ్యవధిలోనే గొల్లప్రోలు పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన పబ్బిరెడ్డి పాపారావు, కావ్య తమ మూడేళ్ల కుమారుడు రిత్విక్ శ్రీహాన్‌ను తీసుకుని మార్కెట్ సెంటర్‌లో గల తన అన్నయ్య గట్టెం అప్పలరాజు ఇం టికి వెళ్లారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటూ ఉన్న శ్రీహాన్ కనిపించడం లేదని తల్లిదండ్రులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టారు. 216వ జాతీయ రహదారిపై గల అపర్ణా హోటల్ వద్ద బాలుడిని గుర్తించారు. అనంతరం సుహాన్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు. గంట వ్యవధిలోనే తమ కు మారుడి ఆచూకీ కనుగొని అప్పగించిన ఎస్ఐ రామకృష్ణ, పోలీసులకు పాపారావు, కావ్య దంపతులు, బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గంజాయితో ముగ్గురి అరెస్ట్

2.400 కిలోల స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సుబ్బాయమ్మఘాట్ సమీపంలోని పామాయిల్‌తోటలో గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం టూటౌన్ ఎస్ఐ శ్యాంసుందర్, అర్బన్ డిప్యూటీ తహశీల్దార్, సిబ్బంతో కలిసి పామాయిల్‌తోటలో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2 కిలోల 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం ఆల్‌కట్ గార్డెన్స్ కొత్తపల్లి వారి వీధికి చెందిన కోనాల స్వరూప్ కుమార్ అలియాస్ స్వరూప్, అదేప్రాంతం తుమ్మవారి వీధికి చెందిన బచ్చుడేవిడ్ రాజు, రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు కోనేరుపేటకు చెందిన దూది త్రినేష్ పాడేరు నుంచి గంజాయి కొనుగోలు చేసుకుని రాజమహేంద్రవరం తెచ్చుకుని కొంత తాగారు. మిగిలిన దానిని పొట్లాలుగా కట్టి అమ్ముకోవడానికి సిద్ధం చేసుకున్నారు. దీంతో ఈ ముగ్గురుని పట్టుకుని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురు నేరచరిత్ర కలిగిన వారే అని, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని పేర్కొన్నారు.

తరణి ఇండస్ట్రీస్‌లో అగ్ని ప్రమాదం

తాళ్లపూడి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామ పరిధిలో గల తరణి ఇండస్ట్రీస్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి జగిగిన ఈ ప్రమాదానికి షాట్ సర్క్యూట్ కారణం అని సమాచారం. ఫాక్టరీ గొడౌన్‌లో బేరియం క్లోరైడ్ స్టాక్ ఉండటంతో జరిగిన అగ్నిప్రమాదానికి మంటలు మరింత ఎక్కువగా ఎగిసిపడ్డాయి. ప్రాణ నష్టం ఏమీ జరుగలేదు. కొవ్వూరు ఫైర్ స్టేషన్ నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్లు మంటలను అదుపులోకి తెస్తున్నాయి.

ఫ్యాక్టరీ గొడౌన్‌లో ఎగసిపడుతున్న మంటలు



కిశోరి వికాసం ర్యాలీ

ఆత్రేయపురం,జూన్10(ఆంధ్రజ్యోతి): ర్యాలిలో మంగళవారం కిషోరి వికాశంపై ర్యాలీ జరిపారు. ఈసందర్భంగా 11-18 సంవత్సరాల బాలికలకు వేసవి శిక్షణ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మావతి ఆధ్వర్యంలో కిషోరి బాలికలు, తల్లిదండ్రులతో సమావేశం జరిపారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

బాలకృష్ణ జన్మదిన వేడుకలు

మండపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం మండపేటలో నిర్వహించారు. మండపేట బాలకృష్ణ అభిమాన సంఘం గౌరవ అధ్యక్షుడు బోళ్ల సత్తిబాబు, అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, నందమూరి అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. లూటుకుర్రులో ఉపాధిహామీ నిధులు రూ.2కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం భూమి పూజ చేశారు. అలాగే మినీ గోకులాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అధ్వానంగా తయారైన రోడ్లను ఆధునికీకరిస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాల అందిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ కనిరెడ్డి అంజిబాబు, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, జనసేన, బీజేపీ మండలశాఖ అధ్యక్షులు జాలెం శ్రీనివాసరాజా, భైరిశెట్టి దుర్గారామకృష్ణ, నాయకులు బోనం బాబు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ ఏపీవో రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురు: లూటుకుర్రులో మాట్లాడుతున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

అంబాజీపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సహకారంతో సర్పంచ్‌లు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పుట్టినరోజు సందర్భంగా ఆమెకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, చిన్నం బాలవిజ యరావు, అరిగెల బాలరామ్మూర్తి, అల్లాడ రవి, పులిదిండి సత్యనారాయణ, మైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, సుంకర నాయుడు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

అయినవిల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మంగళవారం తొత్తరమూడి గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈరోడ్డు నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా అనుమతి ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో మరిన్ని రహదారులను పునరుద్ధరించేందుకు కూడా హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతిపై విషం కక్కడం శోచనీయం

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
● అమరావతి మహిళలపై వ్యాఖ్యలకు కూటమి నిరసన



పి.గన్నవరంలో సాక్షి చానల్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



ముమ్మిడివరం: ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలుపుతున్న కూటమి మహిళలు

మలికిపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలను నాశనం చేయడానికి వైసీపీ పార్టీ అన్ని కుట్రలు పన్నుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అమరావతి రాజధానిని వక్రీకరించి మాట్లాడడం మహిళల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని అన్నారు. వైసీపీ పాలనలో అమరావతి రాజధానిని అటకెక్కించారని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు కేంద్ర నాయకులతో ప్రధాని మోదీ సహకారంతో చట్టబద్ధతగా అమరావతిని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సాక్షి చానల్ డిబేట్‌లో అమరావతి రాజధాని గురించి మహిళల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ఆ వ్యాఖ్యలు చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇంటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. సాయిబాబా గుడి నుంచి గాంధీబొమ్మల సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. షేమ్ షేమ్ జగన్.. సాక్షి విషప్రచారంపై నిరసన వ్యక్తం చేశారు. భారతీరెడ్డి మౌనం వీడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మంగెన భూదేవి, చెల్లుబోయిన హెలీన, దుర్గాదేవి, ముత్యాల కనకదుర్గ, అడబాల రమాదేవి, జక్కంపూడి శ్రీదేవి, కాకి లక్ష్మీదేవి, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, గుండుబోగుల పెదకాపు, గెడ్డం సింహ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

ముమ్మిడివరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, సాక్షి మీడియాను బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ముమ్మిడివరంలో కూటమి మహిళలు నిరసన చేపట్టారు. టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాసరి జగదీశ్వరి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కూటమి మహిళలంతా పోలమ్మ చెరువుగట్టున ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని చేతిలో ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. వైఎస్ భారతీరెడ్డి మౌనం వీడాలి. జగన్మోహన్‌రెడ్డి ఏపీని వీడాలి అంటూ ప్లకార్డులు చేతబట్టి సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రహదారిపై సాక్షి పేపర్ ప్రతులను ఉంచి దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, దొమ్మేటి రమణకుమార్, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, విళ్ల వీరాస్వామినాయుడు, దాట్ల బాబు, మెండి కమల, బొక్కా రుక్మిణి, సాకా సీతాదేవి, ముత్యాల జయలక్ష్మి, బద్రి రమ, గిడ్డి రత్నశ్రీ, కుడుపూడి మల్లేశ్వరి, పెదపూడి రుక్మిణి, మాదే యోగీశ్వరి, అత్తిలి లక్ష్మీప్రసన్న, రూప, గోదశి గణేష్, కురసాల శివ, రెడ్డి శ్రీను, జంగా భవానీ, కాశి లాజర్, ఎస్ఎంఎస్ ప్రసాద్, సరిపల్లి శ్రీనివాసరాజు, గోరింట శ్రీనురాజు, పాయసం చిన్నీ, జాగు సత్తిబాబు, చింతపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

అసభ్య వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

పి.గన్నవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై సాక్షి చానల్‌లో అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కూటమి నేతలు, మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం మాట్లాడారు. సాక్షి చానల్‌ను భర్తరఫ్ చేయాలని, స్త్రీలను గౌరవించాలని నినాదాలు చేస్తూ పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు కుంపట్ల నాగలక్ష్మి, బొండాడ నాగమణి, యల్లమిల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సంసాని లక్ష్మీగౌరి, మద్దుల అనూరాజేశ్వరి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, మొల్లేటి శ్రీనివాస్, దొమ్మేటి సాయికృష్ణ, శేరు శ్రీనుబాబు, యడ్ల ఏసు, తాటికాయల శ్రీనివాసరావు, అన్నాబత్తుల హనుమాన్, కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

'దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి'



వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

అమలాపురం టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తెనాలిలో దళిత యువకులపై పోలీసులు నడి రోడ్డుపై లాఠీచేయడాన్ని నిరసిస్తూ వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పల సత్తిబాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దళిత మైనార్టీలపై పోలీసులు దాడికి దిగడం మానవహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, దీనిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు పెయ్యల పరశురాముడు, బాలయోగి, శెట్టిబత్తుల తులసీరావు, పచ్చిమాల శివ, ఊటాల వెంకటేష్, మోకా శ్రీనివాస్, ఏలియా, జంగం సుబ్బారావు, చీకట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీస్వామి దేవస్థానం ఈవోగా సత్యనారాయణ



అంతర్వేది, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ కోనసీమ జిల్లా డీఈవో వి.సత్యనారాయణకు అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించినట్టు ఆయన తెలిపారు. ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ముదునూరి సత్యనారాయణరాజు వ్యక్తిగత కారణాలతో 45రోజులు సెలవుపై వెళ్లారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు.

అయినవిల్లి ఆలయ ఈవోగా భవానీ



అయినవిల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారిగా ద్రాక్షారామ ఆలయ ఈవో అల్లు భవానీ మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న ముదునూరి సత్యనారాయణరాజు వ్యక్తిగత కారణాలతో 45రోజులు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు.

పీహెచ్‌సీ తనిఖీ

రాయవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మాచవరం పీహెచ్‌సీని మంగళవారం మలేరియా జిల్లా అధికారి నక్కా వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో నమోదవుతున్న జ్వరాల కేసులు, రక్త నమూనాల సేకరణపై పరిశీలన చేశారు. ప్రజలు డెంగ్యూ జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను వైద్య ఆరోగ్య సిబ్బందికి వివరించారు. చెల్లూరులోఆరోగ్య సిబ్బందితో సర్వే చేయించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తతోనే ప్రధాన పంట కాల్వలు



లంకలగన్నవరం వద్ద పంటకాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్త

పి.గన్నవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో పంట కాల్వలకు నీటిని కట్టేసిన సమయంలో ప్రధాన పంటకాల్వలు, చానల్స్, చిన్న కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం కాల్వల స్థితిగతులపై కనీసం దృష్టి సారించలేదు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. కాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు వెళ్లడం లేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈవేసవిలో పలు చానల్స్ పరిధిలో పూడికతీత పనులు నిర్వహించారు. ప్రధాన పంటకాల్వలను మాత్రం కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో కాల్వలు చెత్తతో నిండిపోయాయి. ఈనెల ఒకటో తేదీన అధికారికంగా కాల్వలకు సాగునీరు వదిలినప్పటికి లొల్ల లాకులు వద్ద, అమలాపురంలోని ఈదరపల్లి వద్ద వంతెన పనులు దృష్ట్యా కాల్వలకు తక్కువగా నీటిని వదులుతున్నారు. దీంతో కాల్వల్లోకి మెల్లమెల్లగా నీరు వస్తుంది. ఈక్రమంలో కాల్వల్లో భారీగా పేరుకుపోయి ఉన్న గుర్రపుడెక్క, తూటు, చెత్త భారీగా పైకి తేలుతోంది. కాల్వలకు పూర్తిస్థాయిలో నీరు వచ్చిన వెంటనే తూటు తొలగింపుపై ఇరిగేషన్ అధికారులు దృష్టిసారిస్తే మొదటిపంట నారుమళ్లకు సక్రమంగా నీరందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రతీ ఏడాది తూటు తొలగింపుపై అధికారులు దృష్టి సారించకపోవడంతో కాంట్రాక్టర్లు మమా అనిపిస్తున్నారని పలువురు రైతులు విమర్శిస్తున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మలికిపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మలికిపురంలో మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటుచేశారు. ఫౌండేషన్ సభ్యుడు శృంగారపు బాబు, దొంగ శివకృష్ణ, ఆచంట శ్రీనివాసరావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పంటకాలువల శుభ్రం.. రహదారిపైనే వ్యర్థాలు



రహదారి పక్కన వేసిన వ్యర్థాలు

అంబాజీపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శివారు భూముకు సాగునీరు పూర్తిస్థాయిలో అందించేందుకు కాలువల్లో పూడిక తీసి పంటకాలువలు శుభ్రం చేస్తున్నారు. పంటకాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, వ్యర్థాలు తీసి రహదారి పక్కనే పడవేస్తున్నారు. అసలే ఇరుకు రహదారులు, ఆపై చెత్త, తూడు, వ్యర్థాలు పడవేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ మహిళ ప్రమాదానికి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. పంటకాలువ గట్టుకు అటువైపు చెత్త, వ్యర్థాలు వేస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని స్థానికులు సూచిస్తున్నారు.

నేడు సప్తనదీ మహాజ్యేష్ఠాభిషేకం



అంతర్వేది, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం జ్యేష్ఠ నక్షత్ర పర్వదినాన శ్రీస్వామివారి మూలవరులకు సప్తనదీ జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఇప్పటికే ఆలయం వద్దకు కావేరి, సింధు, నర్మదా, గోదావరి, సరస్వతి, యమున, గంగ నదుల జలాలు ఆలయం వద్ద పవిత్ర జలాలుగా అర్చకులు భద్రపరిచారు. ఈ సప్త నదీ జలాలతో స్వామివారికి మహాజ్యేష్ఠాభిషేకం, మహా శాంతి హోమం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఏసీ సత్యనారాయణ తెలిపారు.

ఆబోతుకు చికిత్స

మలికిపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వియ్యారివారి మెరకలో ఆబోతును గుర్తు తెలియని వ్యక్తులు వెనుక రెండు కాళ్లను కత్తితో నరికారు. దీంతో రక్తం కారుతున్నా ఆబోతుకు స్థానిక యువకులు పశు వైద్యులను తీసుకువచ్చి చికిత్స చేయించారు.

మణికుమార్‌కు పీహెచ్‌డీ



పి.గన్నవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉడిమూడి శివారు ఆదిమూలంవారి పాలేనికి చెందిన కోటిమణికుమార్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో హైబ్రిడ్ మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ ఫర్ ఫోర్‌కాస్టింగ్ స్టూడెంట్ అకాడమిక్ ఫెర్మార్మన్స్ యూసింగ్ ఈ-లెర్నింగ్ డేటా మైనింగ్‌పై సిద్ధాంత వ్యాసం రాశారు. చెన్నై భరత్ యూనివర్సిటీ సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ తయ్యల్ నాయగి పర్యవేక్షణలో వ్యాసాన్ని ఆయన సమర్పించారు. దీనిపై భరత్ యూనివర్సిటీ కోటికి పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ప్రస్తుతం ఆయన సర్ సీఆర్‌రెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సహచర ప్రొఫెసర్లు, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రత్యేక పూజలు

ఆలమూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కాళ్లకూరి సూరిపండి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారికి ఇష్టమైన తమలపాకులతో పూజలు చేశా రు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

తహశీల్దార్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



జాయింట్ కలెక్టర్ నిషాంతికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లాలోని తహశీల్దార్లు

అమలాపురం టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి తహశీల్దార్‌పై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లు మంగళవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిలకు వినతిపత్రాలు అందజేశారు. ఘటన జరిగిన వెంటనే స్పందించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీలకు యూనియన్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అయినవిల్లి మండలంలో తాడి చేసిన వ్యక్తికి ఏవిధమైన భూములు లేనప్పటికీ అకారణంగా దాడి చేయడం దారుణమన్నారు. దాడిలో గాయపడ్డ తహశీల్దార్ నాగలక్ష్మమ్మకు సంఘీభావం తెలిపారు. జిల్లా ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌తో పాటు వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

హర్షితాభాగ్యకు ప్రతిభా అవార్డు

కాట్రేనికోన, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తమ పాఠశాల విద్యార్థిని కొప్పిశెట్టి హర్షితాభాగ్య షైనింగ్ స్టార్‌గా కలెక్టర్ నుంచి రూ.20వేల నగదు, పతకం, ప్రశంసాపత్రం అందుకున్నట్టు శ్రీవాణి విద్యాసంస్థల అధినేత తాతపూడి సుబ్బారావు తెలిపారు. విద్యార్థినిని వైస్ ప్రిన్సిపాల్ టి.సత్యవతీదేవి, పి.వ్యాసమూర్తిశర్మ(తంబి), కె.ప్రసాద్, ఎస్.కృష్ణ, శిరీష, గౌరి అభినందించారు.

ముగిసిన చలివేంద్రాలు

అమలాపురం టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంద రోజుల పాటు అమలాపురం పట్టణంలోని మూడు కేంద్రాల్లో నిర్వహించిన మూడు చలివేంద్రాలను మంగళవారం నుంచి ముగించారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఈఏడాది మార్చి 4 నుంచి ప్రధాన రద్దీ ప్రాంతాలైన అమలాపురం గడియారస్తంభం సెంటర్, శుభకలశం సెంటర్, కలెక్టరేట్ ఎదుట చలివేంద్రాలను నిర్వహించారు. ఫౌండేషన్ ఫౌండర్ కొలిశెట్టి తాతాజీ, చీకట్ల కిరణ్‌కుమార్, దామిశెట్టి వాసు, ఆర్కే. నాయుడు, హనుమాన్ బుజ్జి తదితరులు పూర్తి సేవలు అందించగా డాక్టర్ ఎన్.విజయ్‌కుమార్, డాక్టర్ కె.శ్రీనుబాబు, డాక్టర్ కారం రవితేజ తదితరులు దాతృత్వం చాటుకున్నారని వివరించారు.

యువకుడి ఆత్మహత్య

ఉప్పలగుప్తం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మద్యం అలవాటు మానుకోవలసిందిగా తల్లిదండ్రులు మందలించడంతో గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రుకు చెందిన యువకుడు కమిడి సురేష్(25) ఈనెల7న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

మామిడికుదురు, జూన్10(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య జఠిలంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈదరాడలో ఉన్న సమగ్ర మంచినీటి పథకంలో సమస్య తలెత్తింది. దీంతో ఈదరాడ, కొమరాడ, మగటపల్లి గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. ఈగ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం ఆయా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

'వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం'

రాజోలు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వ్యతిరేక వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు సరైన నిర్ణయం తీసుకుందని మానవహక్కుల జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ హర్షం వ్యక్తంచేశారు. రాజోలు నియోజకవర్గ ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జానీ అధ్యక్షతన మంగళవారం అంతర్వేదిపాలెం జామియా మసీదులో వక్ఫ్ బోర్డు సవరణ చట్టం 2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి యేడిద రాజేష్, ఆకుమర్తి రవి, ముత్యాల శ్రీనివాసరావు, జనపల్లి నాని, గెడ్డం రేచల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సెన్‌టాక్ కోఆర్డినేటర్‌గా అమన్‌శర్మ

యానాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ (సెన్‌టాక్) కోఆర్డినేటర్‌గా యానాం పూర్వ పరిపాలనాధికారి, పుదుచ్చేరి ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ అమన్‌శర్మను నియమించినట్లు విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ సౌమ్య తెలిపారు. అదేవిధంగా కన్వీనర్‌గా విలియనూర్ కస్తురిబా కళాశాల ప్రిన్సిపాల్ చెరిల్ ఆన్ గెనార్డిన్ శివమ్ నియమితులయ్యారు. తొమ్మిదిమంది సభ్యులతో సెన్‌టాక్ కమిటీని ప్రభుత్వం నియమించింది. పుదుచ్చేరిలో మెడిసన్, ఇంజనీరింగ్ వంటి వివిధ వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశాల కోసం సెన్‌టాక్ ఆధ్వర్యంలో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తుంది.

'బాలకార్మికులను పనిలోకి తీసుకుంటే జరిమానా'

పి.గన్నవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాలకార్మికులను పనిలోకి తీసుకుంటే సంబంధిత యజమానికి రూ.50వేలు వరకు జరిమానా, జైలు శిక్ష పడుతుందని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశిశివనాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. పిగన్నవరం సెంటర్‌లో ఐసీడీఎస్, విద్యాశాఖ, ఎన్‌జీవోలు సంయుక్త ఆధ్వర్యంలో పలు షాపులను తనిఖీ చేసి అనంతరం మాట్లాడారు. ప్రతి షాపు వద్ద బాలకార్మికులకు ప్రవేశం లేదని బోర్డులు ఉంచాలని, లేబర్ లైసెన్సులు కలిగి ఉండాలని షాపుల యజమానులకు సూచించారు. అనంతరం షాపుల యజమానులకు బాలకార్మికుల చట్టాలపై వివరించి సహకరించాలని ఆయన కోరారు. ఈతనిఖీల్లో ఐసీడీఎస్, విద్యాశాఖ, ఎన్‌జీవోలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 132 కేవీ రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరండబుల్ సెక్యూర్డ్ లైన్‌కు సంబంధించి టవర్ల మరమ్మతు పనులు చేసేందుకు బుధవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దశలవారీగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ గురుబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ తెలిపారు. అమలాపురం, కొత్తపేట, రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

టీడీపీ అంబాజీపేట గ్రామ అధ్యక్షుడిగా శ్యామ్



అంబాజీపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అంబాజీపేట గ్రామకమిటీ ఎన్నిక స్థానిక వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద మంగళవారం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దొమ్మేటి శ్యామ్, ప్రధాన కార్యదర్శిగా నేదునూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వంకా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ గణపతి వీరరాఘవులు, అరిగెల బలరామమూర్తి తదితరుల ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు.

గ్రామశాఖలతో టీడీపీ బలోపేతం

మామిడికుదురు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామశాఖల ద్వారా పార్టీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అల్లూరి గోపీరాజు పేర్కొన్నారు. అప్పనపల్లి గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులను మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కేతా శ్రీనివాస్, సెక్రటరీగా తులా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కుసుమ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా తటవర్తి శ్రీరామచంద్రమూర్తిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాటి గోవిందు, కంకిపాటి వెంకటేశ్వరరావు, మొల్లేటి చక్రపాణి, కామిశెట్టి వెంకన్న, పాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి పాలనలో భద్రత కరువు'

అమలాపురం టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలు, బాలికలకు రక్షణ కొరవడిందని వైసీపీ జిల్లాశాఖ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆరోపించారు. సేవ్ ఉమెన్.. సేవ్ ఆంధ్రా అంటూ బాబు పాలనలో భద్రత కరువు పేరిట వైసీపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దివంగత కుడుపూడి చిట్టబ్బాయి ఇంటి వద్ద నుంచి హైస్కూలు సెంటర్ మీదుగా మద్దాల వారిపేట వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, జక్కంపూడి విజయలక్ష్మి, నాయకులు గన్నవరపు శ్రీనివాసరావు, కుడుపూడి భరత్‌భూషణ్, ఖాదర్‌బాషా, చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని వెంకటచంద్రశేఖర్, కొనుకు బాపూజీ, కుడుపూడి భాగ్యలక్ష్మి, రెడ్డి సత్యనాగేంద్రమణి,కుడుపూడి సత్యశైలజ, యిళ్ల శేషగిరిరావు, గుత్తుల చిరంజీవి పాల్గొన్నారు.

పుదుచ్చేరి యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు

యానాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కేంద్రీయ విశ్వ విద్యాలయానికి నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ఎ ప్లస్ కేటగిరీ అక్రిడేషన్ వచ్చినట్లు ఉపకులపతి ప్రకాష్‌బాబు తెలిపారు. ఇది విశ్వవిద్యాలయం సాధించిన సమష్టి విజయానికి దక్కిన గుర్తింపు అన్నారు.

కిశోరి వికాసం

ఐపోలవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగింపు పేరిటప్రభుత్వం చేపట్టిన కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం ఐ.పోలవరంలో జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీవో నిహారిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి టీడీపీ నాయకుడు సాగిరాజు సూరిబాబురాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. వ్యక్తిత్వ వికాసంపై వక్తలు మాట్లాడారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రాజు, ఎంపీడీవో శర్మ, కార్యదర్శి జీఎస్ఎన్ ప్రసాద్, బొంతు ప్రసాద్, నంబూరి సీతారామరాజు, పులపకూర కొండ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శ్రీవాణికి ఘన సత్కారం

కాట్రేనికోన, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనలో ఫ్రెండ్లీ క్లబ్ వేసవిలో స్వరకామాక్షి పేరుతో ఉచిత సంగీత శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. సంగీత కళాకారిణి ఆణివిళ్ళ శ్రీవాణీసుబ్బలక్ష్మి సంగీత శిక్షణ ఇచ్చారు. శ్రీతేజస్వినీ జ్యోతిషాలయం వేదికగా నెల రోజులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఫ్రెండ్లీ క్లబ్, శిక్షణ పొందిన బాలబాలికలు శ్రీవాణిని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆమెకు స్వరవాణీమిత్ర బిరుదును, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపకుడు ఆకొండి నాగరవీంద్రజోగయ్యశాస్త్రి, గ్రంధి నానాజీ, తాతపూడి లక్ష్మీనారాయణమూర్తి, చెరకు శివయ్య, మల్లాడి రాధాకృష్ణ, కోటిపల్లి నరేంద్ర, ఆకొండి సూర్యకాంతం, ఆకొండి లీల, వి.మాధవి, పార్థు పాల్గొన్నారు.

134మందికి పింఛన్లు

పి.గన్నవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 134మందికి పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్యలో భర్త చనిపోయిన మహిళలకు పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఈనెల12న ప్రారంభిస్తారని, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు అందిస్తారన్నారు.

మండపేట

అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను సైతం అభివృద్ధిపథం లో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దేవరపల్లిలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవరపల్లి నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారి నిర్మాణం, ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డు పనులను చేపడతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, కొప్పిశెట్టి ప్రసాద్, జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, కేతా శ్రీను, వాసంశెట్టి రామకృష్ణ, మమ్ము, నామాల నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.98 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,98,494 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మాచవరం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న మలేరియా జిల్లా అధికారి వేంకటేశ్వర్

పీహెచ్‌సీ తనిఖీ

రాయవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం మలేరియా జిల్లా అధికారి నక్కా వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో నమోదవుతున్న జ్వరాల కేసులు ఏవిధంగా ఉన్నాయి అనే అంశాన్ని పరిశీలించడంతో పాటు రక్త నమూనాల సేకరణ ఏవిధంగా ఉంది అనే అంశంపై ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రజలు డెంగ్యూ జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను వైద్య ఆరోగ్య సిబ్బందికి వివరించారు. చెల్లూరు గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో సర్వే చేయించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలయ్య జన్మదిన వేడుకలు

మండపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం మండపేటలో నిర్వహించారు. మండపేట బాలకృష్ణ అభిమాన సంఘం గౌరవ అధ్యక్షుడు బోళ్ల సత్తిబాబు, అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, నందమూరి అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

నత్తనడకన సైఫాన్ నిర్మాణ పనులు

• బ్యాంక్ కెనాల్‌కు అందని సాగునీరు • నిర్మాణ పనుల్లో పర్యవేక్షణ కరువు



ఆత్రేయపురం మండలం లొల్ల వద్ద సైఫాన్ నిర్మాణం

ఆత్రేయపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి రైతుల పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ముంపు బారినపడిన పొలాలను రక్షించే వారే కరువయ్యారు. మండలంలోని లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం, ఆత్రేయపురం గ్రామాలకు చెందిన పంట పొలాల్లో వర్షంనీరు ముందుకు వెళ్లే దారి లేక ఆయా పంట పొలాలు చెరువులను తలపించేవి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంత రైతుల కన్నీటిని తుడిచేందుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇటీవల నడుం బిగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దశాబ్దాల కల సాకారం చేశారు. ఎట్టకేలకు రూ.2.30 కోట్లతో సైఫాన్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేయడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. లొల్ల, వాడపల్లి వద్ద రెండు సైఫాన్లు నిర్మిస్తున్నారు. ముక్తేశ్వరం బ్యాంకు కెనాల్ కాలువ కింద నుంచి డ్రైనేజీ ద్వారా ముంపునీరును మురుగుకాలువలోకి మళ్లించే పనులు నత్తనడకగా సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైనేజీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు పర్యవేక్షణ కరువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాటి పనులను సంబంధిత కాంట్రాక్టర్లు నత్తనడకన చేపడుతున్నారని ఆరోపణలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో ముందుకు సాగడం లేదు. ఆర్‌అండ్‌బీ రోడ్డును తవ్వి పనులు చేపట్టడంతో వాహనాలను ఆత్రేయపురం-లొల్ల మీదుగా మళ్లించారు. కాలువలు మూసిన వెంటనే చేపట్టాల్సిన పను లు ఆలస్యం కావడంతో ఆయా పనులు నత్తనడకగా సాగుతున్నాయని రైతులు వ్యాఖ్యానిస్తు న్నారు. ఇటీవల సెంట్రల్ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. అమలాపురం-గన్నవరం కాలువలకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా సైఫాన్ పనులు చేపట్టడంతో ముక్తేశ్వరం కాలువకు నీటిని నిలుపుదల చేశారు. సైఫాన్ నిర్మాణ పనుల్లో ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణలో పనులు జరగడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భూభాగంలో చేపడుతున్న పనులు కావడంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్వాలిటీ కంట్రోల్ అధికారులు సర్దిపై చేయాల్సి ఉంది. నాసిరకం నిర్మాణాలతో అరకొరగా పనులు చేపడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జూన్ 10 నాటికి ఈ పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మొక్కుబడిగా ఆయా పనులు చేపడతారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటి పనులను జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించి సైఫాన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు.





రామచంద్రపురంలో నిరసన ప్రదర్శన జరుపుతున్న మహిళలు. పక్క చిత్రంలో కొత్తపేటలో మహిళలను కించపర్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ అంబేడ్కర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న మహిళలు

మహిళలను అవమానించిన వారిని శిక్షించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తూ బుధవారం రామచంద్రపురంలో మహిళలు పెద్ద ఎత్తున ప్రదర్శన జరిపారు. స్థానిక లయన్స్ కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శన మెయిన్ రోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్ వరకు జరిగింది. ఈ ప్రదర్శనలో మహిళలు నినాదాలు చేశారు. రాజగోపాల్ సెంటర్‌లో మానవహారం జరిపారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన, సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాక్షి దినపత్రిక ప్రతులను చింపివేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా నాయకురాలు జాస్తి విజయలక్ష్మి, వైట్ల గజలక్ష్మి, బళ్ల లక్ష్మి, నెక్కంటి జానకి లక్ష్మి తదితరులు మాట్లాడారు. మహిళలను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలు క్షమించరానివని భారతిరెడ్డి, జగన్‌రెడ్డి మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన సాక్షి చానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట పంచాయతీ నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకూ నినాదాలు చేస్తు ర్యాలీ జరిపారు. వారు మాట్లాడుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి చానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్లో అంబేడ్కర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో కొత్తపేట సర్పంచ్ బి.జయలక్ష్మి, మాజీ సర్పంచ్ సరెళ్ళ సరిత, యు.పావని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ల



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండపేటలో చేపట్టిన పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. పురపాలక సంఘం సాధారణ నిధులతో 14వ వార్డులో నిర్మించిన బీసీ సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. 19వ వార్డులోని డొక్కా సీతమ్మ మహిళాశక్తి భవనం లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూకదుర్గారాణి, మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు మందపల్లి దొరబాబు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టరు గడి సత్య వతి, టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి వాడా ప్రసాదరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కాళ్లకూరి సూరిపండి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారికి ఇష్టమైన తమలపాకులతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

నేడు పీఠంలో పౌర్ణమి పూజలు

రాయవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి పౌర్ణమి పూజలు నిర్వహిస్తామని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. మంగళవారం పీఠంలో ఆయన మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి భక్తులతో సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహానివేదన జరుగుతాయన్నారు. పీఠంలో ఉన్న భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తులసిదళ అర్చనలు, హోమం, పూర్ణాహుతి జరిపి భక్తులకు తీర్థప్రసాదాన్ని అందజేస్తామన్నారు. విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన జరుగుతుందని ఈ పూజల్లో భక్తులు పాల్గొనాలన్నారు.

ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీలు ఏర్పాటు చేయాలి

ఆత్రేయపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో గ్రామ, మండల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేట నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సమావేశం మెర్లపాలెంలో నిర్వహించారు. తొలుతగా నాలుగు మండలాల ఎమ్మార్పీఎస్ నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. పద్మశ్రీ మంద కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా ప్రతి గ్రామంలో పండుగలా నిర్వహించుకోవాలన్నారు. జూలై 7 ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మీరాబీని సత్కరించారు. సమావేశంలో అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో ఘనంగా బలుసులమ్మ తీర్థం

రాయవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం నిర్వహించారు. జ్యేష్ఠమాసంలో వచ్చే పౌర్ణమి రోజున అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం రాత్రి జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని అందంగా అలంకరించారు. అమ్మవారికి ప్రతి రూపాలైన గరగలను గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కూటమి నాయకులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

డ్వాక్రా సంఘాల సొమ్ము గోల్‌మాల్

• రూ.32.40 లక్షలు జమ కాలేదని 26 సంఘాల సభ్యుల ఆందోళన
• మాచవరం ఎస్‌బీఐ బీసీ పాయింట్‌లో ఘటన
• రాయవరం పోలీస్‌స్టేషన్ వద్ద డ్వాక్రా సంఘాల నిరసన



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

రాయవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయంశక్తి సంఘాలు బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణాల వాయిదాల పద్ధతిలో ప్రతి నెల తిరిగి బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్(బీసీ) పాయింట్‌లో చెల్లించిన ఆ సొమ్ములు తమ సంఘాల రుణాలకు జమకాలేదని న్యాయం చేయాలని కోరుతూ మాచవరం గ్రామానికి చెందిన మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు మంగళవారం రాయవరం పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తంచేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన 26 మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు మాచవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రుణాలు పొందారు. బ్యాంక్ ద్వారా ఏర్పాటు చేసిన బీసీ పాయింట్ కరస్పాండెంట్ టి.లక్ష్మి గణేష్ కు బ్యాంక్ అధికారుల సూచనల మేరకు ప్రతి నెలా ఆయా సంఘాలకు చెందిన రుణాలు బీసీ పాయింట్‌లో చెల్లిస్తున్నామన్నారు. ప్రతినెలా బీసీ పాయింట్ నిర్వాహకుడు తమ లోన్ ఖాతా పుస్తకంలో నగదు జమ చేసినట్లు పోస్టింగ్‌లు వేసి ఇచ్చేవారన్నారు. కొన్ని సంఘాల సభ్యులు తిరిగి రుణాలు పొందే క్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యుల రుణం ఎంత ఉందో తెలుసుకునే క్రమంలో తమ ఖాతాకు సొమ్ములు జమ కాలేదని తెలిసిందన్నారు. సుమారు 11 నెలల కాలంలో తమతమ సంఘాలకు చెందిన సుమారు 32 లక్షల 40 వేలు నగదు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బీసీ పాయింట్ కరస్పాండెంట్‌పై డ్వాక్రా సంఘా లు సభ్యులు రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్మును తిరిగి తమ లోన్ ఖాతాలకు జమ చేయాలని , బీసీ పాయింట్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని రాయవరం పోలీస్ స్టేషన్ వద్ద మండల మహిళా సంఘాల అధ్యక్షురాలు కె.శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళలు ఆవేదన వ్యక్తం చేసి ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు జుత్తుక సహాసిని, జి.త్రివేణి, గంగిశెట్టి గంగరత్నం, పి.బుల్లెమ్మాయి, ఎ.దేవి స్వరూప, కట్టా పద్మావతి, జి.దేవి కిరణ్మయి, శాకా కుమారి, గుత్తుల సత్యవేణి , వాసంశెట్టి సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.



కిశోరి వికాసం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కిశోరి వికాసం ర్యాలీ

ఆత్రేయపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలిలో మంగళవారం కిశోరి వికాసంపై ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా 11-18 సంవత్సరాల బాలికలకు వేసవి శిక్షణ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మావతి ఆధ్వర్యంలో కిశోరి బాలికలు, తల్లిదండ్రులతో సమావేశం జరిపారు. అనంతరం ఆయా వీధులలో ర్యాలీ నిర్వహించి పంచాయతీ వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



దుళ్ల మురుగుకాలువ తవ్వకాలను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ మెర్ల

మురుగునీటి కాలువల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ఆలమూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సార్వా సీజన్‌లో వర్షాలకు పంట భూముల్లోని మురుగునీరు సక్రమంగా దిగువకు వెళ్లేలా ఉండేందుకు మురుగునీటి కాలువలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని అభివృద్ధి చేస్తున్నట్లు ఆలమూరు సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి అన్నారు. ఆలమూరు డీసీ పరిధిలోని దుళ్ల-మండపేట మురుగునీటి కాలువ తవ్వకాలను మంగళవారం ఆయన పరిశీలించారు. మురుగునీటి కాలువలు సక్రమంగా లేకపోతే అధిక వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల భూముల్లోని పంటలకు నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ ఇబ్బందులను తొలగించేందుకు మురుగునీటి కాలువను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అవగాహనతో బాల్య వివాహాల నిర్మూలన సాధ్యం

రాయవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన అవగాహనతోనే సాధ్యమౌతుందని వక్తలన్నారు. మండలంలోని పసలపూడి, వెదురుపాక గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. రాయవరం, మాచవరం సెక్టార్ సూపర్‌వైజర్లు విష్ణుకుమారి, సునీత మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ కిశోరి బాలికలు, అంగన్‌వాడీలు ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, కిశోరి బాలికలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అవగాహన

కె.గంగవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): యర్రపోతవరం, అద్దంపల్లి, పేకేరు, కుడుపూరు గ్రామాల్లో మంగళవారం పలువురు దివ్యాంగులకు అవగాహన కల్పించారు. జిల్లి పారామెడికల్ అధికారి ఆధ్వర్యంలో పేకేరు ఆసుపత్రి సిబ్బంది దివ్యాంగ రోగులకు కళ్లు, కాళ్లు, చేతులపట్ల ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడారు. మండలంలో లెప్రసీ వ్యాధిగ్రస్తులు 140 మంది ఉన్నారని జిల్లా వ్యాప్తంగా 1060 మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ నోడల్ అధికారి చిక్కాల సూర్యారావు, వైద్య సిబ్బంది మూర్తి, పరమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ అసెస్మెంట్ సర్వే పరిశీలన

కపిలేశ్వరపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ పరిధిలోని తాతపూడి గ్రామంలో ఎస్‌పీఎం శాఖ ద్వారా నిర్వహించిన క్వాలిటీ అసెస్మెంట్ సర్వేను మంగళవారం డాక్టర్ పి.సుజాత, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజి పీజీ విద్యార్థులు పరిశీలించారు. ఈ అసెస్మెంట్ సర్వేలో వైద్య ఆరోగ్యశాఖ కోనసీమ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సుమలత, అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రత్నకుమారి, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల పీజీ విద్యార్థులతోపాటు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించాలి

కపిలేశ్వరపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాలకార్మికులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శ్రమ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.శేషగిరిరావు సూచనతో మండలంలో జూన్ 10 నుంచి 12 వరకు కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల చేసారు. కార్యక్రమంలో శ్రమ కోఆర్డినేటర్ నాగేశ్వరి, శ్రమ బృందం రమణయ్య, భవాని, శారద, దుర్గారావు, నాగరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత రైతుకు ఆర్థికసాయం

ఆలమూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెనికేరులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన ప్రమాద స్థలాన్ని ఎంపీడీవో ఎ.రాజు మంగళవారం సందర్శించారు. ఈ అగ్ని ప్రమాదంలో రైతు గోపు శ్రీనుకు చెందిన పశువులశాల దగ్ధం కాగా పాడి పశువులు తీవ్రంగా గాయపడాయి. ప్రమాదానికి గల కారణాలను ఆయన తెలుసుకున్నారు. రైతు శ్రీనును కలసి ప్రభుత్వపరంగా సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాజు హామి ఇచ్చి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భాస్కరరావు, కోన దత్తుడు తదితరులు పాల్గొన్నారు.



అలమూరులో యోగా చేస్తున్న పశువైద్యాధికారులు

యోగాతో ఆరోగ్యం పదిలం

ఆలమూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): యోగాను ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా చేయాలని జిల్లా వెటర్నరీ డీహెచ్‌వో డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఆలమూరులో మంగళవారం పశుసంవర్ధకశాఖ కార్యాలయం వద్ద ఉద్యోగులకు ఏడీ ఎల్.అనిత అధ్వర్యంలో యోగాపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు డీహెచ్‌వో వెంకట్రావు విచ్చేశారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, యోగా నిపుణులు డాక్టర్ ఎం.రామకోటేశ్వరరావు యోగా ప్రాముఖ్యత తెలిపారు. ఉద్యోగులతో యోగాసనాలు వేయించారు. ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల పశువైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.